ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 8 నవంబరు 2025



నేడు విద్యా సంస్థలకు సెలవు లేదు: డీఈవో

అనకాపల్లి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ యాజమాన్యాల పరిధిలోని విద్యా సంస్థలు శనివారం యథావిధిగా చేస్తాయని డీఈవో జి.అప్పారావునాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మొంథా" తుఫాన్ కారణంగా గత వారం పాఠశాలలకు సెలవులు ఇచ్చినందున, ప్రత్యామ్నాయంగా రెండో శనివారం సెలవు'ను రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. అన్ని పాఠశాలలను శనివారం తెరవాల్సిందేనని, ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి పిల్లలను పాఠశాలలకు పంపించాలని ఆయన కోరారు.

రేషన్ అక్రమాలకు చెక్

బియ్యం మాఫియా కట్టడికి ప్రభుత్వం పటిష్ఠ చర్యలు

పౌరసరఫరాల శాఖకు ప్రత్యేక కిట్లు



తనిఖీ కిట్‌ను చూపిస్తున్న డీఎస్‌ఓ కేవీఎల్ఎన్ మూర్తి

- పట్టుబడిన బియ్యానికి ద్రావకంతో పరీక్ష
- ఎరుపు రంగులోకి మారితే ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యంగా నిర్ధారణ
- అప్పటికప్పుడే కేసులు నమోదు
- బియ్యంతోపాటు రవాణా చేస్తున్న వాహనాలు సీజ్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న ముఠా పనిపట్టడానికి ప్రభుత్వం సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నది. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు 'రెడ్' సిగ్నల్ వేసింది. అధికారుల తనిఖీల్లో ఎక్కడైనా బియ్యం పట్టుబడితే అవి రేషన్ బియ్యమా? కాదా? అన్నది నిగ్గు తేల్చేందుకు ప్రత్యేకంగా ర్యాపిడ్ కిట్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. అక్రమార్కులపై అక్కడికక్కడే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకువాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించింది.

చౌక ధరల దుకాణాల ద్వారా పేద వర్గాలకు ఉచితంగా అందించే బియ్యం చాలా వరకు పక్కదారి పడుతున్నది. బియ్యం లావుగా వుండడంతో కార్డుదారుల్లో పలువురు రేషన్ బియ్యాన్ని వినియోగించడానికి ఆసక్తి చూపడంలేదు. ఇదే అదనుగా భావించి కొంతమంది దళారుల అవతారం ఎత్తారు. గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికి వెళ్లి కార్డుదారుల నుంచి రేషన్ బియ్యం కిలో రూ.15కి కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు కొంతమంది రేషన్ డీలర్లు కూడా కార్డుదారులకు డబ్బులు ఇచ్చి, బియ్యం తమవద్దనే ఉంచేసుకుంటున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని రైస్ మిల్లర్లకు కిలో రూ.18-20 చొప్పున అమ్ముతున్నారు. మిల్లుల్లో వాటిని మరోసారి పాలిష్‌పట్టించి, కిలో రూ.40-45 చొప్పున వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు. కిరాణా దుకాణాల్లో ఇవే బియ్యం రూ.50-55కి విక్రయిస్తున్నారు. ఇదో పెద్ద మాఫియాలా సాగుతోంది. గత కొన్నేళ్ల నుంచి.. ముఖ్యంగా వైసీపీ హయాంలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం భారీఎత్తున సాగింది. పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేస్తున్నప్పటికీ రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం ఆగడంలేదు. ఒకవేళ పట్టుబడితే 6ఏ కింద కేసు నమోదు చేస్తున్నారు. ఇది సాధారణ కేసు కావడంతో అక్రమార్కులు వెనకడుగు వేయడంలేదు.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఆదేశాలతో పౌరసరఫరాలు, విజిలెన్స్ అధికారులు పలుచోట్ల రైస్ మిల్లులు, గోదాములపై దాడులు నిర్వహించి లక్షలాది టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు గతంలో మాదిరిగా లావు బియ్యం కాకుండా.. పోషక విలువలతో కూడిన ఫోర్టిఫైడ్ రైస్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తున్నది. అయినప్పటికీ రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్టు ప్రభుత్వం గుర్తించింది.

అక్రమాలకు చెక్

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఎనిమిది మంది పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లకు మొబైల్ ర్యాపిడ్ కిట్లను అందజేసింది. ఒక్కో కిట్‌లో పొటాషియం థయో సైనైడ్, హైడ్రోక్లోరిక్ యాసిడ్ వుంటాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణా అవుతున్నట్టు సమాచారం వచ్చినా, లేకపోతే అనుమానం ... మిగతా 8వ పేజీలో

కిట్లతో తనిఖీలు చేస్తున్నాం

రేషన్ బియ్యాన్ని కొంతమంది పక్కదారి పట్టిస్తున్నారు. ఇటువంటి వాటిని అడ్డుకొనేందుకే ప్రభుత్వం ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి 100 కిలోల బియ్యంలో ఒక కిలో మల్టీవిటమిన్ మిక్స్, ఐరన్‌తో కూడిన బియ్యాన్ని కలుపుతారు. తనిఖీలు చేసినప్పుడు బియ్యం శాంపిల్స్ తీసి, వాటిపై కిట్లలోని ద్రావణాన్ని చల్లుతారు. బియ్యం రంగు మారితే రేషన్ డిపోలకు సరఫరా చేసిన బియ్యంగా నిర్ధారించి కేసులు పెడతాం. కొత్త తరహా కిట్లతో ఇప్పటికే తనిఖీలు జరుగుతున్నాయి.

కేవీఎల్ఎన్ మూర్తి,
జిల్లా పౌర సరఫరాల అధికారి

బలహీనంగా గోవాడ వంతెన

వరద ఉధృతికి పిల్లర్ల చుట్టూ కోత

- వంతెనపై జాయింట్ల వద్ద పెరుగుతున్న ఖాళీ
- పేరుకుపోయిన మట్టి, పెరిగిన పిచ్చిమొక్కలు
- భారీ వాహనాలు వెళుతున్నప్పుడు ప్రకంపనలు
- ఆరున్నర దశాబ్దాలు కావడంతో శిథిలస్థితికి చేరిన వారధి
- ముప్పు వాటిల్లితే రవాణా వ్యవస్థ అస్తవ్యస్తం
- త్వరగా కొత్త వంతెన నిర్మించాలని ప్రజల వినితి





బలహీనంగా మారిన గోవాడ వంతెన పిల్లర్లు. (ఇన్‌సెట్‌లో) వంతెనపై జాయింట్ల మధ్యలో ఏర్పడిన ఖాళీ

చోడవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మూడు జిల్లాల ప్రజలు నిత్యం ప్రయాణించే బీఎన్ రోడ్డులో శారదా నదిపై గోవాడ వద్ద వున్న వంతెన ప్రమాదకర స్థితిలో వుంది. వంతెన దిగువ భాగం చాలా వరకు కోతకు గురైంది. వంతెన పైభాగంలో పిల్లర్ల మధ్య ఖాళీలు ఏర్పడి క్రమేపీ విస్తరిస్తున్నాయి. వంతెన పైభాగంలో నిర్వహణ లేకపోవడంతో ఇరువైపులా మట్టి పేరుకుపోయి, పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగిపోయాయి. మొక్కల వేర్లు వంతెన గోడల్లోకి చొచ్చుకుపోయి కట్టడం బలహీనంగా మారడానికి కారణమవుతు న్నాయి. ఇక వంతెన పైభాగంలో జాయింట్ల మధ్య ఏర్ప డిన ఖాళీల కారణంగా కన్నా లు పెద్దవి అవుతున్నాయి. దీంతో వంతెన మీదుగా వాహనాలు వెళుతున్నప్పుడు ఈ జాయింట్ల వద్ద పెద్ద పెద్ద శబ్దాలు వస్తున్నాయి. భారీ వాహనాలు వెళ్లినప్పుడు భూమి కంపించి నట్టుగా ప్రకంపనలు వస్తున్నాయి. వంతెన బలహీనంగా మారడంతో ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందోనని ఈ మార్గంలో నిత్యంరాకపోకలు సాగించే వారు ఆందోళన చెందుతున్నారు.

శారదా నదిపై గోవాడ వద్ద 1960వ సంవత్సరంలో నిర్మించిన ఈ వంతెన దాదాపు శిథిలావస్థకు చేరింది. ఏజెన్సీలోని పాడేరు, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల మండలాల ప్రజలు మైదాన ప్రాంతంలోని విశాఖపట్నం, అనకాపల్లికి... ఇటు మైదాన ప్రాంత ప్రజలు పాడేరు వైపు వెళ్లడానికి గోవాడ వంతెన మీదుగా ప్రయాణించాలి. ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా వున్న అన్ని వంతెనల స్థితిగతులపై సర్వే చేయించింది. బలహీనంగా ఉన్న వంతెనల జాబితాలో గోవాడ వంతెన కూడా వుంది. ఈ వంతెనకు అత్యవసరంగా మరమ్మతులు చేయాలని ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో అధికారులు పేర్కొన్నారు. చోడవరం నుంచి నర్సీపట్నం, మాడుగుల వెళ్లే మార్గాల్లో ఎక్కడైనా వంతెనలు కూలిపోతే వాహనాలు వెళ్లేందుకు ప్రత్నామ్యాయ మార్గాలు ఉన్నాయి. కానీ గోవాడ వంతెనకు ఏదైనా అయితే మరో మార్గం లేదు. గతంలో బొడ్డేరు నదిపై కూలిపోయిన చిన్నపాటి వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించడానికి ఐదేళ్లు పట్టింది.

చోడవరం నియోజకవర్గం పరిధిలోని బీఎన్ రోడ్డులో ... మిగతా 8వ పేజీలో



వంతెన రెయిలింగ్ పక్కన పేరుకుపోయిన మట్టి, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డి

డిగ్రీ పూర్తికి మరో అవకాశం

స్పెషల్ ఎగ్జామ్స్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్న ఏయూ అధికారులు

- బ్యాక్‌లాగ్స్‌పై భారం తగ్గింపు
- ఒక్కో సబ్జెక్టుకు రూ.15 వేలు ఫీజుగా నిర్ణయించిన గత పాలకులు
- ఇప్పుడు సాధారణ ఫీజుతోనే పరీక్షలు రాసేందుకు అనుమతించాలని ప్రస్తుత వైస్ చాన్సలర్ నిర్ణయం



రాజశేఖర్, ఏయూ వీసీ

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డిగ్రీలో సబ్జెక్టులు ఉండిపోయిన (బ్యాక్‌లాగ్స్) విద్యార్థులకు మేలు చేసేలా ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు నిర్ణయం తీసుకోబోతున్నారు. సాధారణ ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరయ్యే అవకాశాన్ని కల్పించబోతున్నారు. ఏయూ పరిధిలో 190కుపైగా డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. గత పదేళ్లలో ఆయా కాలేజీల్లో చదివిన పలువురు విద్యార్థులు వేర్వేరు కారణాలతో డిగ్రీ పూర్తి చేయలేకపోయారు. కొంతమందికి మూడు నుంచి పదికిపైగా సబ్జెక్టులు బ్యాక్‌లాగ్స్ ఉన్నాయి. అటువంటి వారంతా అవకాశం లభిస్తే డిగ్రీ పూర్తిచేయాలని భావిస్తున్నారు. అయితే, ఒక్కో సబ్జెక్టుకు రూ.15 వేలు ఫీజుగా గత పాలకులు నిర్ణయించారు. అంటే ఒక్కో విద్యార్థి తనకు ఉన్న సబ్జెక్టులను బట్టి కనీసం రూ.15 వేల నుంచి రూ.లక్షకుపైగా చెల్లించాల్సి ఉంటుంది. అందుకే పెద్దగా ఎవరూ ముందుకురాలేదు. ఈ నేపథ్యంలో నామమాత్రపు ఫీజు చెల్లించి ఒకేసారి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు రాసుకునేందుకు అవకాశం కల్పించాలని ... మిగతా 8వ పేజీలో

రావణాపల్లి ఆనకట్టకు ముప్పు

ఏడాదిలో రెండుసార్లు కుంగిన గట్లు

- రాతి గోడకు రంధ్రాలు.. వృథాగా పోతున్న నీరు
- పొర్లుకట్టుకు దిగువున ఊడిపోతున్న రాళ్లు
- అధ్వానంగా మదుములు, తుప్పుపట్టిన గేట్లు
- పూడికతీతకు నోచుకోని కాలువలు



రావణాపల్లి పొర్లుకట్టు మీదుగా పారుతున్న వరద నీరు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):

గొలుగొండ మండలంలోని రావణాపల్లి ఆనకట్టకు ముప్పు పొంచివుంది. ఆనకట్ట గట్టు ఏడాదిలో రెండుసార్లు కుంగింది. రిజర్వాయర్ గోడలకు రంధ్రాలు ఏర్పడి నీరు వృథాగా పోతున్నది. పొర్లుకట్టు రాళ్లు ఊడిపోతున్నాయి. ఈ పరిణామాలతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆనకట్ట రాతి గోడకు రంధ్రాలు ఏర్పడి వృథాగా పోతున్న నీరు

గొలుగొండ, నర్సీపట్నం మండలాల సరిహద్దులో రావణాపల్లి వద్ద వరహా నదిపై 1954లో ఆనకట్ట నిర్మించారు. పొర్లుకట్ట పొడవు 91.5 మీటర్లు. రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 134 ఎంసీఎఫ్‌టీలు. ప్రధాన కాలువ, కొత్తూరు బ్రాంచి కెనాల్, పిల్ల కాలువ ద్వారా రెండు మండలాల పరిధిలో 2,666 ఎకరాలకు నీరు అందుతుంది. ఆనకట్టను నిర్మించి ఏడు దశాబ్దాలు కావడంతో బలహీన పడింది. పొర్లుకట్టు దిగువన రాళ్లు జారిపోయి నీరు లీకవుతున్నది. రాతి పేర్పు, మధ్యంలో సున్నం వేసి నిర్మాణం చేశారు. కాలక్రమేణా సున్నం వదిలేసి, రాళ్ల మధ్య రంధ్రాలు పడి నీరు వృథాగా పోతున్నది. 2024లో ఎడమ గట్టు, ఇటీవల కుడి గట్టు కుంగాయి. ప్రధాన కాలువపై 17 మదుములు వుండగా వీటిలో పది మదుములు శిథిలావస్థకు చేరుకున్నాయి. మదుముల గేట్లు తుప్పు పట్టి పాడయ్యాయి. కాలువలో కొంత భాగం నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలో వుంది. దీంతో ఉపాధి హామీ పథకం కింద కాలువలో పూడికతీత పనులు చేయడానికి వీలులేకపోయింది. పూడికతోపాటు తుప్పలు ... మిగతా 8వ పేజీలో

దొప్పెర్ల భూ సమస్యకు మోక్షం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

22ఏ జాబితా నుంచి సర్వే నంబర్లు తొలగింపు

- ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన తహశీల్దారు
- ఎట్టకేలకు ఫలించిన 15ఏళ్ల పోరాటం

అచ్యుతాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):



తహశీల్దార్ సత్యనారాయణకు భూమి పత్రాలు అందజేస్తున్న రైతులు

భూ సమస్యపై పదిహేనేళ్లుగా పోరాడుతున్న దొప్పెర్ల బార్క్ నిర్వాసితులకు ఎట్టకేలకు ఉపశమనం కలిగింది. 'అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంతో రెవెన్యూ అధికారులు స్పందిచారు. 22ఏలో చేర్చిన భూములను ఆన్‌లైన్‌లో నమోదుచేసే ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు.

బాబా అణు పరిశోధన కేంద్రానికి (బార్క్) రోడ్డు నిర్మాణం కోసం దొప్పెర్ల పంచాయతీకి చెందిన రైతుల నుంచి 2010వ సంవత్సరంలో ప్రభుత్వం భూములు తీసుకుంది. ప్రతి సర్వే నంబరులో కొంతభూమిని ప్రభుత్వం సేకరించగా, మిగిలిన భూమి రైతుల ఆధీనంలోనే వుంది. కానీ అప్పటి అధికారులు అనాలోచితంగా మొత్తం అన్ని సర్వే నంబర్లను 22ఏలో చేర్చారు. దీంతో కుటుంబ అవసరాల నిమిత్తం భూములను అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. 22ఏ జాబితా నుంచి తమ భూములను తొలగించమని రైతులు 15 ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 6వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో ఉన్నతాధికారులు స్పందించారు. రైతులు తమ వద్ద వున్న ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తహశీల్దార్ సత్యనారాయణ గురువారం ప్రకటించారు. దీంతో ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరావు ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం తమ భూములకు సంబంధించిన హక్కు పత్రాల నకళ్లను తహశీల్దార్‌కి అందజేశారు. ఆయన దగ్గరుండి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

విస్తృతంగా వేట

మత్స్యకారులకు కేంద్రం వరం

- ప్రాదేశిక జలాలు దాటి జాతీయ జల్లాల్లోకి వెళ్లడానికి అనుమతి
- పెరగనున్న సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు




(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు మరింత పెంచడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మత్స్యకారులకు ప్రాదేశిక జలాలు దాటి ప్రత్యేక ఆర్థిక మండలి (ఈఈజెడ్)లోకి వెళ్లి చేపలను వేటాడేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇకపై మత్స్యకారులు డీప్ సీ ఫిషింగ్ చేసి బోట్ల నిండా చేపలను వేటాడి తెచ్చుకోవచ్చు.

సముద్రంలో చేపలను వేటాడే మత్స్యకారులు తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల దూరం వరకే వెళ్లాలనేది ఇప్పటివరకూ ఉన్న నిబంధన. ఇవి రాష్ట్ర జలాలు. వీటినే ప్రాదేశిక జలాలు అంటారు. ప్రతి రాష్ట్రానికి ఈ నిబంధన ఉంది. 12 నాటికల్ మైళ్లు దాటి తీరం నుంచి 200 నాటికల్ మైళ్ల వరకు జాతీయ జలాలు. దీనిని ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ (ఈఈజెడ్)గా పేర్కొంటారు. ఈ జలాల్లోకి ప్రవేశించి చేపలను వేటాడాలంటే ప్రత్యేకంగా కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాలి. టూనా చేపలను వేటాడడానికి ఉపయోగించే లాంగ్ లైనర్లకు ఇలాంటి అనుమతులు ఇచ్చేవారు. కొంతమంది అత్యధిక సామర్థ్యం కలిగిన విదేశీ తయారీ బోట్లను తీసుకువచ్చి, వాటికి ఇండియన్ రిజిస్ట్రేషన్ చేయించి లైసెన్స్‌లు తీసుకునేవారు. వాటితో పోటీ పడలేక భారతీయ బోట్లు ... మిగతా 8వ పేజీలో

ఉత్సాహంగా వందేమాతరం గేయాలాపన



బుచ్చెయ్యపేట మండలం వడ్డాది జడ్పీ ఉన్నత పాఠశాలలో వందేమాతరం గీతాలపన చేస్తున్న విద్యార్థులు

వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఉదయం పది గంటలకు అన్ని విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సామూహికంగా వందేమాతర గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా గేయ రచయిత బంకించంద్ర ఛటోపాధ్యాయను ప్రతి ఒక్కరూ స్మరించుకున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో 'వందేమాతరం' గేయం ప్రజల్లో స్వరాజ్య కాంక్షను రగిలించిందని గుర్తు చేసుకున్నారు.

దేశభక్తిని పెంపొందించే గీతం వందేమాతరం

▸▸ గేయం రచించి 150 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా వక్తలు



మునిసిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి/అచ్యుతాపురం/ రాంబిల్లి/ మునగపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గీతం వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో శుక్రవారం వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఎలమంచిలి మునిసిపల్ కార్యాలయం ఆవరణలో చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, కమిషనర్ ప్రసాదరాజు, సిబ్బంది, విద్యార్థులు అంతా కలిసి సమూహికంగా ఈ గీతాన్ని చక్కగా ఆలపించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వందేమాతరం గేయాన్ని 1875లో బంకిమ్ చంద్ర ఛటర్జీ దేశభక్తిని పెంపొందించేలా రచించారన్నారు. అదే విధంగా తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో తహశీల్దార్ వరహాలు, రెవెన్యూ సిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎంవీ రమణ సమక్షంలో సామూహికంగా గీతాలాపన చేశారు. గేయం ప్రాధాన్యతను వక్తలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్, రెవెన్యూ సిబ్బందితో పాటు పలువురు ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శివస్వాముల అంబలం పూజ



అంబలం పూజకు హాజరైన శివమాల ధరించిన భక్తులు

మునగపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాక సాంబమూర్తి దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం రాత్రి శివమాల ధరించిన భక్తులు చేపట్టిన అంబలం పూజ నేత్రపర్వంగా సాగింది. తొలుత స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మాలధరించిన భక్తులు చక్కని పాటలు పాడి స్వామిని ఆరాధించారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.

అచ్యుతాపురం : ఎంజేపురంలో గురువారం రాత్రి అయ్యప్ప అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అయ్యప్ప పీఠం స్వాములంతా సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ పూజా కార్యక్రమానికి అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల నుంచి పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు స్వామిని కీర్తిస్తూ చక్కని పాటలు పాడారు.

ముగిసిన గుమ్మడి అమ్మలు పేరంటాల వేడుక

▸▸ రెండు రోజులపాటు విశేష పూజలు ▸▸ అమ్మవారిని దర్శించుకున్న స్పీకర్ అయ్యన్న, కలెక్టర్ విజయకృష్ణన్ ▸▸ సత్కరించిన ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకుంటున్న స్పీకర్ అయ్యన్న



కలెక్టర్‌కు అమ్మ చిత్రపటం అందిస్తున్న ఎమ్మెల్యే



ఆకట్టుకున్న నవదుర్గల వేషధారణలు

రాంబిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న గుమ్మడి అమ్మలు పేరంటాల మహోత్సవం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కుటుంబ సభ్యుల ఆరాధ్య దేవతగా విరాజిల్లుతున్న అమ్మవారికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇదిలావుంటే, శుక్రవారం అమ్మవారిని శాసన సభ స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు తదితర నేతలు, అధికారులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కలెక్టర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు ఎమ్మెల్యే విజయకుమార్, ఆయన సోదరుడు సతీష్‌కుమార్ బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం ఆలయం ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్నసమారాధన జరిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సీఐ నర్సింగరావు ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నివారణ



అవగాహన సదస్సులో వైద్య సిబ్బంది, పలువురు మహిళలు

అచ్యుతాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు జాగ్రత్తలతో పాటు ఆరోగ్యకరమైన జీవన శైలి ద్వారా క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చునని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కె.శ్రావ్య అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని శుక్రవారం ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటైన సదస్సులో ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ అంటే భయపడాల్సిన అవసరం లేదని ముందుగా పరీక్షలు చేయించుకొని చికిత్సలు పొందితే నయం కావచ్చునన్నారు. తమ సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తారని ప్రజలంతా సహకరించాలని ఆమె కోరారు. ప్రభుత్వం పద్దెనిమిదేళ్ల పైబడిన ప్రతి పౌరుడికి నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారావు, సీఐ నమ్మి గణేష్, హెల్త్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఎస్.వర లక్ష్మి, లండా అప్పలకొండ, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

వాడనర్సాపురంలో అభయాంజనేయ తీర్థం రేపు



రాంబిల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకార గ్రామమైన వాడనర్సాపురంలో ఈ నెల తొమ్మిదో తేదీ ఆది వారం అభయాంజనేయ తీర్థం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆ రోజు వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.

సొంత నిధులతో చేతి బోరుకు మరమ్మతులు



బోరును వినియోగంలోకి తీసుకువచ్చిన అజయ్

రాంబిల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జి.చింతువా పంచాయతీ శివారు చింతువా గ్రామంలో పాడై మూలకు చేరిన తాగునీటి చేతిబోరును లోవపాలేనికి చెందిన మండల తెలుగుయువత అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్ తన సొంత నిధులు వెచ్చించి శుక్రవారం అందుబాటులోకి తీసుకు వచ్చారు. కొన్ని నెలలుగా ఇక్కడ బోరు పనిచేయడం లేదని తెలుసుకున్న ఆయన ఈ మేరకు స్పందించడంతో గ్రామస్థులు అతనిని అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసలందుకున్న మోడల్ స్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

మునగపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిలో జరిగిన ప్రతిభ పోటీల్లో ఇక్కడి మోడల్ స్కూల్ విద్యార్థులు అద్భుతంగా రాణించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.పి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో సబ్బవరం మండలం ఇరువాడలో శుక్రవారం జరిగిన పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు వివిధ నమూనాలతో హాజరయ్యారన్నారు. వ్యవసాయరంగానికి, స్టార్ హోటల్‌లో సర్వీసింగ్‌కు దోహదపడే రోబో నమూనాలను తయారు చేసి, వాటి పనితీరును చక్కగా వివరించారన్నారు. దీంతో అందరి ప్రశంసలు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా వాటిని తయారు చేసిన విద్యార్థులు బి.బద్రీనాథ్, యశ్వంత్, శ్యామ్, బి.యశ్వంత్‌లను ఆమెతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేయాలి

ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పారావు - నీటి ముంపులో పొలాల పరిశీలన



మడుతూరులో నీటి ముంపులో ఉన్న పొలాన్ని పరిశీలిస్తున్న బృందం

అచ్యుతాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ముగిసి పదిరోజులు గడుస్తున్నా అధికారులు ఇంతవరకు పంట నష్టం నమోదు చేయకపోవడం దారుణమని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు అన్నారు. శుక్రవారం ఆయన మడుతూరు పరిధిలో ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మడుతూరు పరిధిలో వరితో పాటు బొప్పాయి, అరటి తోటలు నీటమునిగాయన్నారు. అయినప్పటికీ అధికారులు ఇంతవరకు రైతులకు పంట రక్షణకు సంబంధించి సూచనలు సలహాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. మడుతూరు పరిధిలో సుమారు 50 ఎకరాల్లో వివిధ పంటలు తుఫాన్ కారణంగా దెబ్బతిన్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పంట రక్షణకు పలు సూచనలు చేయడంతో పాటు పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కెసో మునాయుడు తోట వెంకటేశ్వరరావు, నడిపూరి సోములు, మోటూరు భద్రాద్రి, ఎస్.నాగేశ్వరరావు, పప్పల రాము తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం గేయం ఆలాపన



కొడవటిపూడిలో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు

కోటవురట్ల, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవటిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం వందేమాతరం గేయాన్ని ఉత్సాహంగా లపించారు. ఈ గేయం రచించి శుక్రవారంతో 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యార్థులు దేశభక్తిని చాటుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్స్యకార సమస్యలపై నాఫ్ పోరాటం

▸▸ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అప్పలరాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న అప్పలరాజు

పాయకరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి జాతీయ మత్స్యకార సంఘం పోరాటం చేస్తున్నదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు తెలిపారు. స్థానిక సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలో రసాయన పరిశ్రమల కారణంగా నీరు, గాలి కలుషితమై మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారని, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ సమస్యలపై ప్రభుత్వానికి, ప్రతిపక్ష నేతకు వినతిపత్రాలు అందజేశామన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే పోరాటం చేసేందుకు నాఫ్ కూడా సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాఫ్ అనకాపల్లి జిల్లా జాయింట్ సెక్రటరీ ధోని గోపి, పాయకరావుపేట మండల అధ్యక్షుడు సూరాడ శ్రీను పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో ఉత్సాహంగా రిమ్‌జిమ్



వివిధ వేషధారణలతో అలరిస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో రిమ్‌జిమ్-2025 కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతోంది. విద్యా సంస్థల ఆవరణలో శుక్రవారం సాహిత్యం, జానపద పాటలు, సంప్రదాయ నృత్యాలు, ఫ్యాన్సీ డ్రెస్ తదితర అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ శనివారం జరుగనున్న ముగింపు కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ది హిందూ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ అర్నాల, జేఎన్‌టీయూ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీఎస్ఆర్.దీక్షితులు హాజరవుతున్నారని తెలిపారు. పోటీల్లో శ్రీప్రకాష్ పాయకరావుపేట, తుని, అన్నవరం శాఖల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వసతుల కరువు

అపరిశుభ్రంగా బస్టాండ్ ఆవరణ

అధ్వానంగా మురుగుదొడ్లు.. ప్రయాణికులు, సిబ్బంది ఇక్కట్లు





పాయకరావుపేట ఆర్టీసీ బస్టాండ్... అధ్వానంగా తయారైన మరుగుదొడ్లు

పాయకరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాల ఆర్టీసీ బస్ సర్వీసులకు ఉపయోగపడుతున్న పాయకరావుపేటలోని కాంప్లెక్స్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ కనీస వసతులు కరువయ్యాయి. ఫలితంగా ప్రయాణికులు, డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అనకాపల్లి, కాకినాడ జిల్లా తుని ఆర్టీసీ డిపోల బస్సులు పాయకరావుపేట కాంప్లెక్స్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న ఆర్టీసీ బస్టాండ్ నుంచి రోజూ పదుల సంఖ్యలో సర్వీసులు నడుస్తున్నాయి. ఈ బస్టాండ్ నుంచి పాయకరావుపేటతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారు. అలాగే కూటమి ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ ప్రయాణం ఉచితం చేసినప్పటి నుంచి ప్రయాణికుల తాకిడి మరింత పెరిగింది. తుని ఆర్టీసీ డిపో నిర్వహణలో ఉన్న ఈ బస్టాండ్‌లో కంట్రోల్ పాయింట్ లేదు. రోజూ బస్టాండ్‌ను శుభ్రం చేసే నాథులు లేకపోవడంతో ప్రయాణికులు కూర్చొనే ప్రదేశాల్లో అపరిశుభ్రంగా ఉంటున్నది. దీనికితోడు అదే ప్రాంతంలో ఎప్పుడూ ఎవరో ఒకరు నిద్రిస్తూ ఉంటున్నారు. దీంతో బస్సుల కోసం ప్రయాణికులు కాంప్లెక్స్ ఆవరణలో నిలబడాల్సి వస్తోంది.

అలాగే బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం లేక బయట దుకాణాల్లో వాటర్ ప్యాకెట్లు, సీసాలు కొనుక్కొంటున్నారు. బాత్‌రూమ్‌లు కూడా అధ్వానంగా మారడంతో తిప్పలు తప్పడం లేదు. వీటి నిర్వహణ అంతంతమాత్రంగానే ఉండడంతో ప్రయాణికులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ముక్కులు మూసుకుని ఉపయోగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతి రోజూ మధ్యాహ్న సమయంలో డ్రైవర్లు, కండక్టర్లు బస్టాండ్‌లో సరైన వసతులు లేక బస్సుల్లోనే భోజనాలు చేస్తున్నారు. పైగా ఆ సమయంలో పదుల సంఖ్యలో బస్టాండ్‌కు వస్తున్న బస్సులు నిలిపేందుకు స్థలం లేక ముందు వచ్చిన బస్సు బస్టాండ్ నుంచి బయటకు వచ్చేంతవరకు మెయిన్‌రోడ్డులో బస్సులు నిలిపివేస్తున్నారు. ఫలితంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అలాగే బస్టాండ్‌లో సరైన రక్షణలేక అనకాపల్లి డిపోనకు చెందిన నైట్ హాల్ట్ బస్సులు తుని ఆర్టీసీ డిపోనకు వెళ్లిపోతున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి రోజూ వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించే పాయకరావుపేట బస్టాండ్‌లో అన్ని వసతులు సమకూర్చడంతో పాటు డ్రైవర్లు, కండక్టర్లకు విశ్రాంతి గది ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై అవగాహన



అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పాయకరావుపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరమైన క్యాన్సర్ పట్ల మహిళలు జాగ్రత్తగా ఉండాలని, ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని శుక్రవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మండలంలోని మాసాహెబ్‌పేట గ్రామంలో ఈ కార్యక్రమం చేపట్టారు. క్రమం తప్పకుండా మహిళలు రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని, మద్యం, మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ కొంతం శ్రీనువాసరావు, సీహెచ్‌వో మౌనిష, ఏఎన్ఎం తులసి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటవురట్లలో...

కోటవురట్ల, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధి పట్ల వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి ఆధ్వర్యంలు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కనకలక్ష్మి, డాక్టర్ ఝూన్సీ, డాక్టర్ బిందు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను నిర్ధారించి సకాలంలో వైద్యం అందిస్తే పూర్తిగా నయమవుతుందన్నారు. అనుమానం ఉన్నవారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వ్యాధిపై అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ స్టాఫ్‌నర్సు జె.పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనులపై సీఈవో ఆరా



దార్లపూడిలో పర్యటిస్తున్న సీఈవో నారాయణమూర్తి

ఎస్.రాయవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి గ్రామంలో సురక్షిత తాగునీరు అందించేందుకు జల జీవన్ మిషన్ ద్వారా రూ.159.05 లక్షల వ్యయంతో జరుగుతున్న పైపులైన్ పనులపై జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నారాయణమూర్తి ఆరా తీశారు. ఈ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు తాగునీరు అందించేందుకు అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుభాషిణి, ఎంపీడీవో పి.మీనాకుమారి, డిప్యూటీ ఎంపీడీవో బంగారు సత్యనారాయణ, ఈఈ జె.అనిల్‌కుమార్, డీఈఈ వై.ఆనంద్, జేఈ మనోజ్‌కల్యాణ్, పంచాయతీ కార్యదర్శి మూర్తి పాల్గొన్నారు.

కూలిన విద్యుత్ స్తంభం.. తప్పిన ప్రమాదం



వేమగిరిలో నేలకూలిన విద్యుత్ స్తంభం

ఎస్.రాయవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమగిరి గ్రామంలోని రజకుల వీధిలో పెదరామాలయం వద్ద విద్యుత్ స్తంభం శుక్రవారం కూలిపోయింది. దీంతో ఇంటి పక్కనే విద్యుత్ వైర్లు పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ ప్రాణాపాయం తప్పిందని స్థానిక ప్రజలు ఊపిరి తీసుకున్నారు. అంతేకాకుండా స్తంభం కూలిన వెంటనే విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇవ్వగా, సరఫరా నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. కాగా స్తంభం కూలడంతో ఆ ప్రాంతంలో సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంబంధిత అధికారులు మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఇంటి పన్నులు వసూలు చేయండి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో మీనాకుమారి

ఎస్.రాయవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో మీనాకుమారి ఆదేశించారు. దార్లపూడి గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ, సచివాలయ ఉద్యోగులతో ఇంటి పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయడంతో పాటు సచివాలయ సిబ్బందికి ప్రతి రోజూ పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని ఎంపీడీవో మీనాకుమారి ఆదేశించారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ, కార్యదర్శి మూర్తి పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్‌ను రద్దు చేసేవరకూ పోరాటం

నక్కపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేసేవరకూ పోరాటం విరమించేది లేదని మత్స్యకారులు స్పష్టం చేశారు. రాజయ్యపేట కేంద్రంగా ఈ ప్రాంత మత్స్యకారులు బల్క్‌డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 55వ రోజుకు చేరుకున్నాయి. శిబిరం వద్దే వంటా-వార్పు కార్యక్రమం చేపట్టారు. తమ ప్రాణాలతో ఆటలాడుకోవడం తగదని, అభివృద్ధి అంటే అందరికీ ఉపయోగపడే పరిశ్రమలు వుండాలి తప్ప ప్రజల ప్రాణాలను హరించేలా కాదని స్పష్టం చేశారు. బల్క్‌డ్రగ్ పార్కును వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

10వ తేదీలోగా
స్కూల్ బస్సుల్లో భద్రతా పరికరాలు

▸▸ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు ఇన్‌చార్జి డీటీవో సూచన


పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీటీవో వెంకటరమణ

అనకాపల్లి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు స్కూల్ బస్సుల్లో భద్రతా ప్రమాణాలను విధిగా పాటించాలని ఇన్‌చార్జి డీటీవో ఆలుమూరి వెంకటరమణ స్పష్టం చేశారు. మండలంలోని కొప్పాకలో గల జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో శుక్రవారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్సు ప్రయాణం సమయంలో ఆపద వచ్చినప్పుడు తెరవడానికి వీలుగా అత్యవసర ద్వారాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గరిష్ఠంగా గంటకు 60 కిలోమీటర్లు వాహన వేగ నియంత్రణ పరికరాన్ని అమర్చుకోవాలన్నారు. హ్యాండ్ బ్రేక్, మెయిన్ బ్రేక్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వాహనం పైన నలుమూలల అంబర్ లైట్ అమర్చుకోవాలన్నారు. పైన తెలిపిన నిబంధనలన్నీ ఈనెల పదో తేదీలోగా తమ వాహనాల్లో అమర్చాలని సూచించారు. ఈ సమావేశంలో రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

పక్కా నాణ్యతతో అభివృద్ధి పనులు : జడ్సీ చక్రవర్తి


నెయ్యిల వీధిలో కల్వర్టు పనులను పరిశీలిస్తున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులను పక్కా నాణ్యతతో చేపట్టాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. నెయ్యిలవీధి వద్ద డ్రైనేజీ ఆధునీకరణ పనులను పరిశీలించారు. అలాగే పలు వార్డుల్లో చెత్తకు నిప్పు పెట్టడాన్ని చూసి స్థానికులను హెచ్చరించారు. చెత్తను జీవీఎంసీ సిబ్బంది తొలగిస్తున్నప్పుడు తగులబెట్టాల్సిన అవసరం ఏమి వచ్చిందని ప్రశ్నించారు. ఇకపై ఇలా చేస్తే చర్యలు తప్పవన్నారు. అన్న క్యాంటీన్‌లను పరిశీలించి భోజనాలకు వచ్చే వారికి సౌకర్యాలు కల్పించడంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మెయిన్‌రోడ్డులోని పలుచోట్ల దుకాణాల ముందు రోడ్డుపైకి సామగ్రి, టెంట్లు ఏర్పాటు చేసి ఉండడాన్ని పరిశీలించిన దగ్గరుండి తొలగింపజేశారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధించినట్టు ఈ సందర్భంగా జెడ్సీ తెలిపారు.

గంగవరంలో విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం

సబ్బవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరం గ్రామంలో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని శుక్రవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. గంగవరం గ్రామం సర్వే నంబరు 38/1లో 20.31 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో సుమారు రెండు ఎకరాల భూమిని గతంలో కాలనీకి కేటాయించగా, మిగిలినది ఖాళీగా ఉంది.


ఆక్రమణ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు దృశ్యం

ఇటీవల కొంత మంది ఖాళీగా ఉన్న భూమిని ఆక్రమించుకొని మొక్కలు నాటడంతో పాటు చుట్టూ ఫెన్సింగ్ వేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం సదరు భూమిని, అందుకు సంబంధించిన రికార్డులను తహశీల్దార్ బి.చిన్నికృష్ణ పరిశీలించారు. అనంతరం ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్ఐ బి.వీరయ్య, వీఆర్వో రాంబాబు, వీఆర్ఏలు రమేశ్, అనిల్ ఆ భూమిని స్వాధీనం చేసుకుని, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

ద్విచక్ర వాహనం అపహరణపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అపహరణపై ఫిర్యాదు అందినట్టు పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. కశింకోటకు చెందిన గోగుల మణికంఠ అనే వ్యక్తి గత నెల 31వ తేదీన తన ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులోని ఒక సెల్లార్‌లో పెట్టి విశాఖకు వెళ్లారన్నారు. మరుసటి రోజు తిరిగి వచ్చేసరికి ద్విచక్ర వాహనం కనిపించలేదన్నారు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం రాత్రి బాధితుడు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ యోచన తగదు'


అమృతపురంలో సంతకాల సేకరణ చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలల ప్రైవేటీకరణ యోచనను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ డిమాండ్ చేశారు. మండలంలోని అమృత పురంలో శుక్రవారం వైసీపీ శ్రేణులు నిర్వ హించిన రచ్చబండ కార్యక్రమానికి ఆయన హాజరై సంతకాల సేకరణను ప్రారంభించి మాట్లాడారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రజలంతా ముక్తకంఠంతో ఖం డించాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ బైల పూడి గౌరీ, మాజీ ఎంపీపీ ఎస్.ముత్యాల నాయుడు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజ్, నాయకులు కర్రి బాబు, బైలపూడి రామా రావు, గొంప అప్పారావు, గండి వెంకట రమణ, ఈశ్వరరావు, కనకరాజు, అప్పారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనులు ప్రారంభం

పరవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక బాధ్యతలో భాగంగా శ్మశానవాటిక అభివృద్ధికి రూ. 12లక్షలు మంజూరు చేసినట్టు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. స్థానిక నాయకులు పైలా రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా పోతునాయుడు, గండి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

ప్రతి నోటా.. చక్కని పాట

▸▸ తెల్లవారి గుండెల్లో ఫిరంగుల మోత మోగించిన మధుర గీతం ▸▸ 'వందేమాతరం' రచించి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా పాఠశాలల్లో సామూహికంగా ఆలాపన


డీపీఎన్ కళాశాలలో మాట్లాడుతున్న రత్నాకర్, చిత్రంలో బీజేపీ నాయకుడు పరమేశ్వరరావు


పరవాడ మండలం తానాం బాలికల గురుకుల పాఠశాలలో గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు


సబ్బవరం మండలం గొటివాడ పాఠశాలలో గీతాన్ని ఆలపిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాలలో..

అనకాపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గీతం వందేమాతరం గేయం రచించి 150 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలపించారు. పట్టణంలోని దాడి వీరునాయుడు కళాశాలలో జరిగిన ఈ వేడకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మాట్లాడుతూ వందేమాతరం గీతాన్ని 1875లో బంకిమ్ చంద్ర చటర్జీ రచించారన్నారు. భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల్లో దేశభక్తిని పెంచడంలో ఈ గీతం కీలక పాత్ర పోషించినట్టు చెప్పారు. అనంతరం వేదికపై ఉన్న అతిథులతో పాటు విద్యార్థులంతా ఈ గీతాన్ని చక్కగా ఆలపించారు. ప్రిన్సిపాల్ కె.రమేష్, ఎస్ఆర్ జమీర్, యు.నాగేశ్వరరావు, బి.భానుమతి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుండగా, నోబుల్ చారిటీస్ కార్యాలయం ఆవరణలో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. పరిషత్ రీజనల్ కన్వీనర్ ఎస్.గోపాలరావు, ప్రాంతీయ పర్యావరణ పరిరక్షణ కన్వీనర్ ఎస్.నూకరాజు, వర్మ, త్రినాథరావు, విఠల్, రమణ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో జాతీయ గీతం వందేమాతరం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు మాట్లాడుతూ వందేమాతరం గీతాన్ని బంకిమ్ చంద్ర చటర్జీ రచించారన్నారు. అనంతరం ఈ గీతాన్ని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో పాటు విద్యార్థులు ఆలపించారు.

సబ్బవరం : వందేమాతం గీతం రచించి నూట యాభై సంవత్సరాలు పూర్తికావస్తున్న సందర్భంగా గొటివాడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బాలబాలికలు, ఉపాధ్యాయులు ఈ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎంఈవో ఎన్. లక్ష్మణరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమా నికి స్ఫూర్తి, ప్రేరణగా ఈ గీతం నిలిచిందన్నారు. అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బొండా సత్యారావు, నీటి సంఘం అధ్యక్షుడు సాలాపు సూరిబాబు, హెచ్ఎం పీవీ ఆనంద్, ఎస్ఎంసీ ఛైర్మన్ నూకరాజు, పాల్గొన్నారు. అలాగే, బీజేపీ నాయకులు స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఈ వేడుకలు నిర్వహించి వందేమాతరం గీతం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు రెడ్డి రామునాయుడు, స్వామాట్ కుమార్, బి.అప్పారావు, లావణ్య, ఈశ్వరరావు, వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : జాతీయ గీతం వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలపించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో స్వరాజ్య కాంక్ష రగిలించి తెల్లవారి గుండెల్లో ఫిరంగుల మోత మోగించి స్ఫూర్తిగా నిలిచిన వందేమాతరం గేయం నూట యాభై వసంతాలు పూర్తి చేసుకోవడం గర్వకారణమని బీజేపీ యువమోర్చ జిల్లా కార్యదర్శి మోస రామకృష్ణ అన్నారు. వాడచీపురుపల్లి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఆయన వందేమాతరం గేయాన్ని ఆలపించారు. బీజేపీ నాయకులు కొండలరావు, కార్యకర్తలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తానాం ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో జాతీయ గీతాన్ని విద్యార్థినులతో కలిసి ఉపాధ్యాయులు ఆలపించారు. జాతీయ గీతం గొప్పతనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాకిరెడ్డి సుహాసిని, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్ వ్యాధి నయం

▸▸ జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవంలో డీఎం హెచ్‌వో డాక్టర్ హైమావతి


అవగాహన ప్రదర్శనలో డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి, తదితరులు


కశింకోటలో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అనకాపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి సూచించారు. ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయంలో శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏటా ఎక్కువ సంఖ్యలో క్యాన్సర్ కేసులు వెలుగుచూస్తున్నట్టు చెప్పారు. వీటిలో చాలా కేసులు ఆలస్యంగా గుర్తించడంతో రేడియో, కీమో చికిత్సలు తీసుకోవాల్సిన అవసరం వస్తుందన్నారు. తిరిగి నయం చేయలేని స్థితిలో ఉండడంతో అధిక మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం పరిష్కార మార్గమన్నారు. క్యాన్సర్ కోసం భయపడాల్సిన అవసరం లేదని, ముందుగా గుర్తిస్తే పూర్తిగా తగ్గించేగల వ్యాధిగా పేర్కొన్నారు. ప్రభుత్వం 18 ఏళ్ల పైబడిన ప్రతి పౌరుడికి నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ పరీక్షలు చేయించుకోవడానికి ఇంటి వద్దకు వచ్చే ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. సమీపంలో గల పీహెచ్‌సీల్లో ఈ పరీక్షలు ఉచితంగా చేస్తారని వివరించారు. వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, డీఎల్ఏటీవో డాక్టర్ స్వప్న, డీఐవో డాక్టర్ చంద్రశేఖరదేవ్, డాక్టర్ వినోద్, డాక్టర్ ప్రశాంతి, ఎస్తేరురాణి తదితరులతో పాటు, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలావుంటే, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సంయుక్త విద్యాలయంలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. క్యాన్సర్ రిసోర్స్‌పర్సన్ కె. రామ్మోహనరావు ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సానా త్రినాథరావు, జగన్నాథరావు, లలిత, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట పీహెచ్‌సీలో...

కశింకోట : క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఇక్కడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు అన్నారు. జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆసుపత్రిలో ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. క్యాన్సర్ అంటే భయపడాల్సిన అవసరం లేదని ముందుగా పరీక్షలు చేయించుకొని చికిత్సలు పొందితే నయం కావచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు వితరణ

అనకాపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం పార్కు సెంటర్‌లోని రైతు సంఘం వద్ద గల అయ్యప్పస్వామి ఆశ్రమాన్ని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గౌరీ సంఘంలోని అయ్యప్పస్వామి భక్తుల అన్నదాన కమిటీకి రూ.50 వేలు విలువ చేసే బియ్యం బస్తాలు, నూనె డబ్బాలను రైతు సంఘం ఆశ్రమం తరఫున వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల పూర్ణచంద్రరావు, జగ్గారావునాయుడు, పీలా రాముడు, మద్దాల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపనలో కూటమి నాయకులు

కశింకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డీపీఎన్ జడ్పీ హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి కూటమి నాయకులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 18లక్షలతో ఈ భవనం నిర్మాణం కానుందని నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీను, తాకాశి కృష్ణ, బుదిరెడ్డి మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం ఆత్మీయ కలయిక రేపు

అనకాపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు పంచాయతీ పరిధి ఏఎంఏఎల్ హైస్కూల్‌లో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదో తేదీ ఆదివారం వన సమారాధన, ఆత్మీయ కలయిక జరగనుందని సంఘం అధ్యక్షులు గంటి రవికుమార్ తెలిపారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు మునగపాక మండలంలో నివసిస్తున్న బ్రాహ్మణ కుటుంబాలకు ఆహ్వానం పలికినట్టు చెప్పారు. సుమారు నాలుగువేల మంది వరకు హాజరు కానున్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

▸▸ అర్జీల స్వీకరణలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు మాజీ ఎమ్మెల్యే, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను శతశాతం నెరవేర్చామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ అనకాపల్లి మండల అధ్యక్షుడు కర్రి బాబి, నాయకులు బొద్దపు ప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాసరావు, పోలారపు త్రినాథ్, సిదిరెడ్డి శ్రీనివాసరావు, తలారి కాశీనాయుడు, బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


అర్జీని స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద



బహుమతులు పొందిన విజేతలతో సొసైటీ ప్రతినిధులు

ముగిసిన అనకాపల్లి పుస్తక మహోత్సవం

అనకాపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో గల అల్లూరి సీతారామరాజు ప్రాంగణంలో నిర్వహించిన అనకాపల్లి పుస్తక మహోత్సవం శుక్రవారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా వడ్డాది పాపయ్య సాహిత్య వేదికపై జరిగిన చిత్రలేఖనం, సైన్స్ వ్యాసరచన, ఏకపాత్రాబినయం, నృత్య ప్రదర్శనలు, థింసా నృత్యాలు, మేజిక్ షోలు, గీతాలాపన, జనవిజ్ఞానవేదిక నిర్వహించిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలో విశేష ప్రతిభకనబరిచిన చిన్నారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల కరువు భత్యం తక్షణమే విడుదల చేయాలి'


మాట్లాడుతున్న గనిశెట్టి సత్యనారాయణ

పరవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆరు నెలలకు ఒకసారి కార్మికులకు అందించే కరువు భత్యాన్ని తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిత్యావసర ధరలతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగిన నేపథ్యంలో వాటికి అనుగుణంగా కరువు భత్యం పెంచాలన్నారు. ఏడాదికి రెండు పర్యాయాలు ధరలు సూచిక ఆధారంగా వీడీఏ పాయింట్స్‌ను విడుదల చేయాలన్నారు. అక్టోబరు నెలలో వీడీఏ పాయింట్స్ విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో నాయకులు మల్లేశ్వరరావు, కె.కృష్ణ, లక్ష్మణరావు, రమేష్, నాగరాజు, రాము, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో కశింకోట విద్యార్థికి రజతం


అబ్దుల్ అజీజ్ ఖాదరి షా

కశింకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి షేక్ అబ్దుల్ అజీజ్ ఖాదరి షా రజత పతకం సాధించాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల నాలుగో తేదీ నుంచి ఆరో తేదీ వరకు విజయవాడలో నిర్వహించిన అండర్-17 పోటీల్లో ఇతను సత్తాచాటి ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా ఖాదరి షాను హెచ్ఎం ఎన్‌జేవీ ప్రసాద్ అభినందించారు.

మాక్ అసెంబ్లీకి హరిత ఎంపిక

పరవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న అమరావతిలో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీకి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని పాడి హరిత ఎంపికైంది. అనకాపల్లిలో గురువారం పెందుర్తి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడంతో ఈ అవకాశం దక్కిందని ప్రిన్సిపాల్ తెలిపారు.

సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలి

▸▸ సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ ▸▸ ఘనంగా వ్యవస్థాపక వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ

పరవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పురోభివృద్ధికి ఉద్యోగులంతా తోడ్పాటును అందించాలని సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సమీర్‌శర్మ పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ వ్యవస్థాపక వేడుకలను శుక్రవారం ఇక్కడి అడ్మిన్ భవన ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ, రానున్న పదేళ్ల కాలంలో లక్ష మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తే ధ్యేయంగా సంస్థ పనిచేస్తున్నదన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. అంతకుముందు దీపాంజలినగర్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



పాడేరు డిగ్రీ కళాశాలలో వందేమాతరం గీతాలాపన



హుకుంపేటలో నిర్వహించిన ర్యాలీలో పోలీసులు, అధికారులు, విద్యార్థులు

వందేమాతరం గీతం స్ఫూర్తిదాయకం

వాడవాడలా 150 ఏళ్ల ఉత్సవాలు

పాడేరురూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతం భారతీయులకు స్ఫూర్తిగా నిలుస్తోందని డీఎస్పీ షేక్ షహబాజ్ అహమ్మద్ అన్నారు. బకించంద్ర ఛటోపాధ్యాయ రాసిన వందేమాతరం గీతానికి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శుక్రవారం పాడేరు అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు వందేమాతరం గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వందేమాతరం గీతం విశిష్టతను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐ డి.దీనబంధు, ఎస్‌ఐ ఎల్.సురేశ్ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ డివిజన్ నాయకుడు పి.పాండురంగస్వామి స్థానిక మోదమాంబ డిగ్రీకళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని వందేమాతరం గీతంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, టీడీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో వెయ్యి మంది విద్యార్థులు, 50 మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్.రసూల్, అధ్యాపకులు వి.రమేష్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు పాల్గొన్నారు.

కొయ్యూరు: స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాట స్ఫూర్తిని కలిగించిన గీతం వందేమాతరమని ఎంపీడీవో ప్రసాద్ వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ గీతం రాసి 150 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు వందేమాతరం నేర్చుకుని దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు.వివిధ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బక్రించంద్ర చటర్జీ రాసిన ఆనందమఠం నాటికలోని ఈ వందేమాతరం గీతం జాతీయ గేయంగా గుర్తించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్యదర్శులు,గ్రామసచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు: వందేమాతం గీతం శత స్వర్ణోత్సవాలు పురస్కరించుకుని జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. సీలేరు ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగామ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే, సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో ఎస్‌ఈ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఇంజనీర్లు, జెన్‌కో కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది, కాంట్రాక్టు కార్మికులు వందేమాతరం గేయాన్ని ఆలపించి దేశ ఖ్యాతిని చాటారు.

అనంతగిరి: మండల కేంద్రంలోని ఎస్‌ఐ డి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు మానవహారంగా నిల్చొని వందేమాతరం ఆలపించారు. కానిస్టేబుల్ డొంబు, గిరి, వైకుంఠం, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎమ్.శ్యామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జి. మాడుగుల: స్థానిక సీఐ శ్రీనివాసరావు, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినయ్‌గన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఘనంగా జాతీయ గేయం ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ షణ్ముఖరావు, పోలీస్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హుకుంపేట; విద్యార్థులు, సచివాలయాలు, పోలీసులు, అధికారులు శుక్రవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ చెల్లయ్య, స్థానికఎస్‌ఐ సూర్యనారాయణ, హెచ్‌ఎం సువర్ణరాజు, ఎంఈవో ఈశ్వరరావు, ఏవో సత్యనారాయణ, గండేరు సత్యం, పూర్ణిమ, అన్నపూర్ణ, అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాడేరులో వందేమాతరం ఉత్సవంలో పాల్గొన్న డీఎస్పీ, పోలీసులు



సీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

డుంబ్రిగుడ: స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో విద్యార్థులు, సిబ్బంది వందేమాతరం గీతం ఆలపించారు. అనంతరం బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సునీత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు, వర్తకులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ భాస్కర అప్పారావు, ఎంపీడీవో ధర్మారావు, ఎస్‌ఐ జె.రామక్రిష్ణ, ఎంఈవో కృష్ణమూర్తి, సీడీపీవో విమల కుమారి తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరిలో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు



కొయ్యూరులో వందేమాతర గీతం ఆలాపనలో ఎంపీడీవో, సిబ్బంది



ముంచంగిపుట్టులో ర్యాలీ చేస్తున్న అధికారులు, వ్యాపారులు

ఆస్పత్రుల్లో ప్రసవాలతో తల్లీబిడ్డకు శ్రేయస్కరం

డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం. నీలవేణి



గర్భిణులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎ డాక్టర్ ఎం. నీలవేణి

చింతపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో మాత, శిశు మరణాలు నియంత్రించేందుకు గర్భిణులు ప్రసవ సమయానికి పది రోజులు ముందు వసతి గృహాల్లో చేరాలని జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్త (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ ఎం. నీలవేణి సూచించారు. శుక్రవారం ఆమె స్థానిక ఏరియా ఆస్పత్రికి అనుబంధంగా ఐటీడీఏ నిర్వాహణలోనున్న గర్భిణుల వసతి గృహాన్ని సందర్శించారు. గర్భిణుల సదుపాయాలు ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహాల్లో ప్రసవం పొందడం క్షేమకరంకాదని, కొన్ని సందర్భాల్లో తల్లి, బిడ్డ మరణించవచ్చునన్నారు. వైద్యుల పర్యవేక్షణలో ప్రసవం పొందితే మెరుగైన చికిత్స అందుతుందన్నారు. వసతి గృహాల్లో గర్భిణీ, సహాయకులకు భోజనం, వసతి కల్పించనున్నట్టు తెలిపారు.

ఆస్పత్రి భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి

చింతపల్లి ఆస్పత్రి నూతన భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని డీసీహెచ్‌ఎ సూచించారు. నిర్మాణంలోనున్న వందపకడ ల ఆస్పత్రి భవనాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజనీంగ్ అధికారులు మూడు నెలల్లో నిర్మాణాలు పూర్తి చేస్తామని డీసీహెచ్‌ఎస్‌కి తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసం పాదయాత్ర



పాదయాత్రలో ఆధ్యాత్మిక గురువు రామానందస్వామి, ట్రైకార్ డైరెక్టర్ తదితరులు

చింతపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణపురం వనవాసి కల్యాణం ఆశ్రమంలో విశ్వశాంతి, లోక కల్యాణం ఆకాక్షిస్తూ పాదయాత్రను శుక్రవారం అధ్యాత్మిక గురువు రామానందస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పాదయాత్ర సాగి, ఈనెల 17తేదీన ముగిస్తామన్నారు. ఏపీ ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడుముల వెంకట రమణ, వనవాసి కల్యాణం ఆశ్రమం ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక విలువలు పాటించాలి

జి.మాడుగుల: మాతృమూర్తు లంతా ఆధ్మాత్మిక విలువలు పాటించాలని పాకలపాటి గురుదేవుల ఆశ్రమ భక్తురాలు దేవి సూచించారు. విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ అనుబంధంగా ఉన్న స్థానిక విజ్ఞాన భారతి పాఠశాలలో మాతృమూర్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు పాఠశాల సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌తో సమస్యల పరిష్కారం: డీపీవో

డుంబ్రిగుడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ దోహదపడుతుందని డీపీవో చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని శుక్రవారం కిం చుమండ పంచాయతీ కేంద్రంలో సందర్శించారు. ఆయన సంపద కేంద్రాలతోపాటు సంత పరసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మనమిత్ర వాట్సాప్ గవర్నెస్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, పంచాయతీ కార్యదర్శి విజయ్, సచివాలయ సిబ్బంది, అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల రహదారులకు ప్రతిపాదనలు

ముంచంగిపుట్టు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రవాణా సదుపాయంలేని గ్రామాలకు పక్కా రహదారులు నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్టు పంచాయతీ రాజ్ శాఖ ఏఈఈ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని మాకవరం, దోడిపుట్టు పంచాతీల్లో రహదారుల పనులను ఆ యన శుక్రవారం పరిశీలించారు. పీఆర్ నిధులు రూ. 1. 49 కోట్లతో పూర్తయిన అరబీరు నుంచి కుత్తుడ రహదారి నాణ్యతను పరిశీలించారు.

అరకు-పాడేరు రోడ్డులో దట్టంగా మంచు

వాహనచోదకులు లైట్లు వేసుకొని ప్రయాణం



ఉదయం 8 గంటలకు రోడ్డుపై మంచు

హుకుంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజుల నుంచి దట్టమైన పొగమంచు కురుస్తోంది. ఉదయం పది గంటల వరకు సూర్యుడు కనిపించడం లేదు. అరకు-పాడేరు ప్రధాన రహదారిలో పొగమం చు కమ్మేయడంతో వాహనదారులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. రైతులు ఉదయం పూట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగులు విధులకు హాజరయ్యేందుకు దారి కనిపించక భయం భయంగా వాహనాలపై వెళతున్నారు.

డ్రోన్ ద్వారా దోమల నివారణ మందు పిచికారీ



దోమల లార్వా నియంత్రణకు డ్రోన్‌ను వినియోగిస్తున్న వైద్య సిబ్బంది

గూడెంకొత్తవీధి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్రోన్‌ల ద్వారా దోమల లార్వాను నివారిస్తున్నట్టు పెదవలస పీహెచ్‌సీ వైద్యాధికారి పృధ్వీష అన్నారు. శుక్రవారం డ్రోన్ సహాయంతో స్థానిక చెరువులో బీటీఐ(డబ్ల్యూపీ) మందును పిచికారీ చేసి దోమల లార్వాను నాశనం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ చెరువుల్లో లార్వాను నియంత్రణకు ప్రభుత్వం డ్రోన్లు సమకూర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి చంద్రన కుమార్, ఎంపీహెచ్‌ఈవో పోతురాజు, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ శ్రావణి పాల్గొన్నారు.

వరి సిరి



అరకులోయ మండలం బొండాం కొత్తవలసలో పండిన వరి పంట

మన్యంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. పంట పొలాలు వరి సిరులతో కళకళలాడుతున్నాయి. దీంతో వరి కోతలు, నూర్పులు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎండ కాయడంతో వరి పంటను కోస్తున్నారు. వర్షాలు కురిస్తే చేతికొచ్చిన పంట నీటపాలవుతుందన్న ఆందోళనతో రైతులు పంటను కోసి కల్లాలకు తరలిస్తున్నారు. అరకులోయ మండలంలో బొండాం, కొత్తభల్లుగుడ, గన్నెల, పద్మాపురం, పెదలబుడు, చినలబుడు పంచాయతీల్లో వరికోతలు ముమ్మరంగా జరగుతున్నాయి.

-ఆంధ్రజ్యోతి/అరకులోయ

తాగునీటి పథకానికి శంకుస్థాపన

చింతపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాడీపేటలో రూ. 10 లక్షల జడ్పీ నిధులతో రక్షిత మంచి నీటి పథకం నిర్మిస్తున్నట్టు స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తెలిపారు. శుక్రవారం ఈ మేరకు స్థానిక సర్పంచ్ దురియా పుష్పలతతో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జి. కరుణ, ఏఈఈ గడుతూరి స్వర్ణలత, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద రావు, టీడీపీ నాయకుడు లక్కోజు నాగభూషణం, దూరి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు ధారలక్ష్మి పద్మ, కోఆప్టెట్ సభ్యుడు నాజర్‌వల్లి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి..

గూడెంకొత్తవీధి: స్థానిక ప్రధాన రహదారి నుంచి ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాల (ఈఎంఆర్‌ఎస్) వరకు రూ.50లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్టు ఎంపీపీ బోయిన కుమారి తెలిపారు. గురువారం గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘునాథరావు నాయుడుతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎంఆర్ ప్రిన్సిపాల్ ఎంవీ రమణ, టీడబ్ల్యూ ఏఈఈ యాదకిశోర్, సర్పంచ్ సుభద్ర, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, కోఆప్టెడ్ సభ్యుడు దావీదు పాల్గొన్నారు.

ధారకొండను మండల కేంద్రంగా మార్చాలి



గిడ్డి ఈశ్వరికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సీలేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధారకొండ మండల కేంద్రం ఏర్పాటు చేయాలంటూ జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు శుక్రవారం గ్రీవెన్స్‌లో ధారకొండ మండల సాధన కమిటీ నాయకులు చిటికెల రాము, వరప్రసాద్, పోతురాజు కృష్ణ, సుందరరావు, సొన్ను వినతిపత్రం సమర్పించారు. ధారకొండ మండల కేంద్రం ఏర్పాటుపై నివేదికను ప్రభుత్వానికి పంపుతున్నామని కలెక్టర్ హామీ ఇచ్చారని వారు తెలిపారు. అలాగే, టీడీపీ పాడేరు నియోజవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరికి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.

చెక్‌డ్యామ్ మరమ్మతులకు వినతి



అధికారికి వినతిపత్రం అందిస్తున్న పెదపాడు వాసులు

డుంబ్రిగుడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్రా పంచాయతీ పెదపాడులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌నకు మరమ్మతులు చేపట్టాలని కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో వినతి పత్రాన్ని అందజేసినట్టు గ్రామ ఉప సర్పంచ్ మాలిక్ తెలిపారు. అలాగే, పంచాయతీకి పూర్తిస్థాయి గ్రామ కార్యదర్శి, సెక్రటరీలనునియమించాలని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు బొంజుబాబు, గ్రామస్థులున్నారు.

అటవీ హక్కు చట్టంపై శిక్షణ

పాడేరురూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అటవీ హక్కుల చట్టంపై యూత్ వలంటీర్లకు అమృత సంస్థ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో రెండు రోజుల శిక్షణ శుక్రవారం విజయవంతంగా ముగిసిందని సంస్థ డైరెక్టర్ మురళి తెలిపారు. ఐటీడీఏ ఆర్‌వోఎఫ్‌ఆర్‌సెల్‌కు సంబంధించిన డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరరావు, పీఎంయూ టీం నుంచి పాల్గొన్న లోహిత్, రాజేశ్ అటవీ హక్కుల చట్టం, ఎఫ్‌ఆర్‌సీ కమిటీలపై వివరించారు. వలంటీర్లను శుక్రవారం వంజంగి గ్రామానికి తీసుకువెళ్లి గ్రామ స్థాయిలో అవగాహన కల్పించారు.

గంజాయి జోలికి వెళ్తే భవిష్యత్తు అంధకారం: ఎస్‌ఐ

అరకులోయ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): గిరిజన యువతీ, యువకులు గంజాయి సాగు, రవాణాల్లో జోక్యం చేసుకుని కేసుల్లో ఇరుక్కోవద్దని ఎంపీడీవో ఎ.లవరాజు, ఎస్‌ఐ జి.గోపాలరావు అన్నారు. శుక్రవారం మండలంలోని లోతేరులో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గంజాయి కేసులో ఎవరైనా పట్టుబడితే కోర్టులో బెయిల్ రావడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ స్థితిలో యువతీ, యువకులంతా గంజాయి అక్రమ తరలింపులో దూరంగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు, యువత పాల్గొన్నారు.

అనంతగిరి: గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని స్థానిక ఎస్‌ఐ డి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలతో సీడీపీవో సుగుణ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో అందుబాటులో ఉంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు.. గంజాయి రవాణా, సాగు తదితర వాటి సమాచారం తమకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల ఆందోళన

పాడేరురూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వర రావు హెచ్చరించారు. కాఫీ కార్మికుల సమస్యలపై చేపట్టిన సమ్మెలో భాగంగా రెండవ రోజు కాఫీకార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు లింగేరి సుందరరావు ఆధ్వర్యంలో మినుములూరు కాఫీ కాలనీలో కార్మికులు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కె.కాంతమ్మ, సత్యనారాయణ, వసంత, చిన్నాలమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



పుస్తకాలు, రాతసామగ్రిని అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

చింతపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు విద్యలో ఉత్తమ ప్రతిభ చూపాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి అన్నారు. శుక్రవారం మండలం లోని దిగజనబా, చెరువూరు, గిన్నెల బంద, తడ్డపల్లి, బలపం, కోరుకొండ, కుడుముల, వేలంజువ్వి, రాళ్లగెడ్డ ప్రాథమిక పాఠశాలలను పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల బృందం సందర్శించింది. గిరిజన విద్యార్థులకు ఎస్. రాయవరం మండలం పీఆర్‌టీయూ నేతలు దాతల సహకారంతో సేకరించిన నోట్‌పుస్తకాలు, పలకలు, రాతసామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకట రమణ, పీఆర్ టీయూ మండలాధ్యక్షుడు కోరాబు సంజీవరావు, చింతర్ల మధుబాబు, దొంగబంటి సింహాచలం, ఎస్.రాయవరం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుకుంపేటలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

హుకుంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి); హుకుంపేటలో తాగు నీటి సమస్య పరిష్కారంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. హుకుంపేటలో తాగునీటి సమస్యపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో ఇంజనీరింగ్ అధికారులు స్పందించారు. శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది వచ్చి లీకవుతున్న పైపులు పరిశీలించారు. సీపీఎం వీధి నుంచి అడ్డుమండ పాతవైన్ షాప్ ఏరియాలోని రామాలయంవీధిలో సమస్య గుర్తించారు. ప్రస్తుతం రూ. 25లక్షల వరకు నిధులు ఉన్నాయని, ఉన్నతాధికారులను సంప్రదించి తాగునీటి పథకం పనులు చేపడతామని ఇంజనీర్ ఉదయ్ శ్రీ, సిబ్బంది సత్యనారాయణ తెలిపారు.

'టూరిజం రిసార్టులు ప్రైవేటుపరం చేయడం అన్యాయం'



అరకులోయలో హరితవేలీ రిసార్టు ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

అరకులోయ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టూరిజం రిసార్టులు, ప్రాజెక్టులను ప్రైవేటు పరం చేయడం దారుణమని పలువురు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు అరకులోయలోని హరితరిసార్టు ఎదుట ఉద్యోగులు, కార్మికులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టూరిజం కాంట్రాక్టు ఎంప్లాయిస్ మేన్‌పవర్, డైలీవేజ్ ఎంప్లా యిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగరాజు మాట్లాడుతూ ఏళ్ల తరబడి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఉద్యోగభద్రత కల్పించాల్సింది పోయి, తిరిగి వారిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం ఏ మేరకు న్యాయమని ప్రశ్నించారు. లాభాలలో నడిచే టూరిజం కార్పొషన్ ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం మయూ రిహిల్ రిసార్టు, హరితవేలీ రిసార్టులో పనిచేసే టూరిజం కార్మికులు, సంఘ జాయింట్ సెక్రెటరీ అంజలిరావు, ప్రధాన కార్యదర్శి బాబూరావు, ధర్మా, అప్పలస్వామి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ముగ్గురు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఎంఈవో ప్రసాద్, హెచ్‌ఎం పడాల్, ఉపాధ్యాయులు

చింతపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలోని ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్టు ఎంఈవో పీబీవీవీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పాఠశాలను ఎంఈవో సందర్శించారు. గురువారం పాడేరులో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు మర్రి శ్రావణి, వంతల జాయిస్, గెమ్మెలి చిన్నారిలను అభినందించారు. ఈకార్యక్రమంలో పీజీహెచ్‌ఎం బీఎస్‌ఎన్ పడాల్, పీడీ వరలక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ వాహనాలు అడ్డగింత



వాహనాలను అడ్డుకున్న కాఫీ రైతులు

గూడెంకొత్తవీధి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవలసలో శుక్రవారం జాతీయ రహదారి నిర్మాణ వాహనాలను కాఫీ రైతులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో కాఫీ తోటలు, వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతులకు సరైన పరిహారం చెల్లించలేదన్నారు. దీంతో ఎన్‌హెచ్ అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామనడంతో రైతులుఆందోళన విరమించారు.

వాడీవేడిగా పెదబయలు మండల సమావేశం

పంచాయతీ కార్యదర్శులు, నూతన ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరుపై ధ్వజం

అటవీ శాఖ అధికారుల తీరుపై సభ్యుల అసంతృప్తి



అధికారును నిలదీస్తున్న వైస్‌ఎంపీపీ రాజుబాబు

పెదబయలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బొండా వరహాలమ్మ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, డీఎస్సీలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు, అటవీ శాఖ అధికారుల పనితీరుపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు. అనంతరం వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబు మాట్లాడుతూ, మండలంలోని 23 పంచాయతీల కార్యదర్శులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీ కేంద్రాల్లో నివాసం ఉండడంలేదని ఆరోపించారు. ఎంపీడీవో అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొడుతున్నారని మండిపడ్డారు. ప్రజా ప్రతినిధులతోపాటు కార్యదర్శులు సమన్వయంతో పంచాయతీల అభివృద్ధికి పాటు పడాల్సింది పోయి ప్రజలకు అందుబాటులో లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. వీరి తీరు మారకుండా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, మారుమూల గ్రామాలకు ప్రభుత్వం పక్కా రహదారుల నిర్మాణానికి అటవీ శాఖ అధికారులు పర్మిషన్ ఇవ్వకుండా అడ్డుపడటం దారుణమని ఆగ్ర హించారు. ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా మైదాన ప్రాంతం నుంచి మన్యంలో విధులకు చేరిన నూతన ఉపాధ్యాయుల్లో కొంతమంది సక్రమంగా పాఠశాలలకు రావడంలేదని ఎంపీటీసీసభ్యుడు కిమంకరి బొంజుబాబు ధ్వజమెత్తారు. పాఠశాలలు మూతపడి ఉన్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరించడం సరికాదని విమర్శించారు. మండలంలో అన్ని యాజమాన్యాల్లోని 37 పాఠశాల భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు.ఎంపీడీవో శ్యామ్ సుందర్, ఏవో పూర్ణయ్య, ఎంఈవో కృష్ణమూర్తి, జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాల పెంపునకే 'సాల్ట్'

» కోర్సు డైరెక్టర్ ఐవీ.రామిరెడ్డి

చోడవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల్లో వ్యక్తిగత బోధనా నైపుణ్యాలు పెంచే లక్ష్యంతోనే ప్రభుత్వం సపోర్టింగ్ లెర్నింగ్ ట్రాన్సఫర్మేషన్ ప్రొగాం (సాల్ట్) రూపొందించిందని కోర్స్ డైరెక్టర్ ఐవీ.రామిరెడ్డి తెలిపారు. కొత్తూరు బాలికల హైస్కూల్‌లో శుక్రవారం డివిజన్ స్థాయి సాల్ట్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తరగది నిర్వహణ, అభ్యసనా కార్యక్రమాలతో పాటు బోధనకు సంబంధించిన అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఎంఈవో కె.సింహాచలం ప్రారంభించిన ఈ కార్యక్రమంలో చోడవరం, మాడుగుల, కె.కోటపాడు, సబ్బవరం, చీడికాడ, దేవరాపల్లి, రావికమతం మండలాలకు చెందిన 142 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి నిరసనగా 17న చలో ఢిల్లీ

» ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేత డాక్టర్ నాగరాజు

చోడవరం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ ఈ నెల 17న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు తెలిపారు. స్థానిక నూకాంబిక కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుడు సీజేఐగా కొనసాగడాన్ని జీర్ణించుకోలేని శక్తులు, గవాయ్‌పై దాడికి తెగబడడం దారుణమని విమర్శించారు. ఈ దాడి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి వేలాదిగా తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేశ్, ఉత్తరాంధ్ర జిల్లాల మాజీ ఇన్‌చార్జి టి.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు ఎలకా మల్లిబాబు, నాయకులు పి.వెంకటరావు, ఎం.శ్రీనివాసరావు, చిన్న అప్పారావు, ఖండేల వెంకటరావు, దీపక్, సతీష్, రాజశేఖర్, రాజు పాల్గొన్నారు.

చినపాచిలలో 250 పశువులకు వైద్య పరీక్షలు



పశువులకు వైద్యం సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

రావికమతం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపాచిల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ సహకారంతో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరావు ప్రారంభించారు. ఏడీలు టి.పుష్ప, శ్రీనివాసరావు, నోడల్ ఆఫీసర్ సౌజన్య, పశు వైద్యులు జి.నూకేశ్వరావు పి.సురేశ్, బాలతేజ తదితర బృందం దాదాపు 250 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గంగాభవానీ, పాల సంఘం అధ్యక్షుడు ఎ.రాజారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కె.పరదేశి నాయుడు, పాల సంఘం కార్యదర్శి నూకరాజు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

మట్టి కళాకృతుల తయారీపై పోటీలు



కళాకృతులు తయారు చేస్తున్న బాలురు

నర్సీపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాలల ప్రతిభా పాఠశ పోటీలలో భాగంగా శుక్రవారం మట్టి కళాకృతుల తయారీపై పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నారుల చిట్టి చిట్టి చేతులతో మట్టితో తయారు చేసి బొమ్మలు ఆకట్టుకున్నాయి. పోటీలకు న్యాయ నిర్ణేతగా తోట ప్రసాద్, శ్రీనివాసు వ్యవహరించారు. నవంబరు 14న బాలల దినోత్సవం కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని పీఆర్‌టీయూ అధ్యక్షుడు డీజీనాథ్ తెలిపారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై విచారణ

మాకవరపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులపై తహశీల్దార్ జి.వెంకటరమణ శుక్రవారం విచారణ నిర్వహించారు. పీపీఅగ్రహారం, బీఎస్‌పేట, రామన్నపాలెం గ్రామాలకు చెందిన ఫిర్యాదులపై విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు ఉంటే నేరుగా మండల స్థాయి కమిటీకి తెలపాలన్నారు. సాధ్యమైనంత వరకు ఇరు వర్గాలతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వందేమాతరం గీతాలాపన



చోడవరం: వందేమాతర సామూహిక గీతాలాపనలో విద్యార్థులు

చోడవరం/రోలుగుంట/చీడికాడ/కృష్ణాదేవిపేట/మాకవరపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఉదయం విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సామూహికంగా వందేమాతర గేయాన్ని ఆలపించారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని చోడవరం, రోలుగుంట, చీడికాడ, కృష్ణాదేవిపేట, మాకవరపాలెం తదితర మండలాల్లో వందేమాతరం గేయం ఆలాపనలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చాలా విద్యా సంస్థలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కేడిట్లు ముందు వరుసలో ఉంటూ గేయాన్ని ఆలపించి మిగిలిన విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. చోడవరం ఉషోదయ కళాశాలలో చైర్మన్ రమణాజీ వందేమాతర గీతం చారిత్రక నేపథ్యాన్ని విద్యార్థులకు వివరించారు. అలాగే విద్యార్థులు భారీ ఎత్తున జాతీయ జెండాలు పట్టుకుని ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బోధకులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



ఏఎల్ పురం హైస్కూల్‌లో వందేమాతరం గీతాలాపన చేస్తున్న విద్యార్థులు



నాచుపట్టి పేరు కనిపించని స్థితికి చేరిన మండల మహిళా సమాఖ్య భవనం



ఏపీఎం గదిలో గోడలు బీటలు వారి పెచ్చులు ఊడుతున్న దృశ్యం

భవనం చెమ్మగిల్లుతోంది..!

- » శిథిలావస్థలో మాడుగుల మండల సమాఖ్య భవనం
- » శ్లాబు, గోడల నుంచి కారుతున్న వర్షం నీరు
- » పెచ్చులూడుతున్న శ్లాబు.. బీటలు వారుతున్న గోడలు
- » మౌలిక సదుపాయాలూ అంతంతమాత్రమే..!
- » రికార్డులు, కంప్యూటర్లకు రక్షణ కరువు.. ఉద్యోగుల పాట్లు

మహిళల పురోగతికి ఏర్పాటుచేసిన సమాఖ్య భవనం శిథిలావస్థకు చేరింది. ఏమాత్రం వర్షం కురిసినా నీరు లీకవుతోంది. గోడలు, శ్లాబుకు చెమ్మ చేరుతోంది. ఫలితంగా గోడలు బీటలు వారడంంతో పాటు శ్లాబ్ మొత్తం పగుళ్లుదేరింది. దీనికితోడు కనీస సదుపాయాలు లేకపోవడంతో పుస్తకాలు, కంప్యూటర్లు, రికార్డులకు రక్షణ కొరవడుతోంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉద్యోగులు ఫ్లెక్సీలను అడ్డుగా పెట్టుకుని తడవకుండా జాగ్రత్త చేయాల్సి వస్తోంది.



వర్షాలకు నీరు కారిపోయి శ్లాబు, గోడలకు చెమ్మ వచ్చిన దృశ్యం

మాడుగుల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మహిళా మండలి సమాఖ్య (వెలుగు కార్యాలయ భవనం) భవనం దుస్థితి దయనీయంగా ఉంది. గోడలు బీటలు వారి పెచ్చులూడి పడుతుండడంతో సిబ్బంది భయం.. భయంగా విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. వర్షాలు పడితే గోడలు నానిపోయి లోపలకు నీరు చిమ్ముతూ కారుతోంది. కిటికీలకు తలుపులు లేవు. దీంతో ఈదురు గాలుల వర్షం కురిస్తే గదిల్లోకి ఒలిపిరి రాకుండా ఫ్లెక్సీలను అడ్డుగా కట్టుకోవాల్సిన పరిస్థితి. పుస్తకాలు, రికార్డులు భద్రపరుచుకునేందుకు సరైన సదుపాయాలు లేవు. వర్షాలు పడితే శ్లాబ్ నుంచి నీరు వచ్చి పుస్తకాలు, రికార్డులు తడిచిపోతున్నాయి. ఈ భవనంలో ఏపీఎం గది, మరో రెండు గదులు, సమావేశం నిర్వహించుకునేందుకు హాలు ఉంది. ఆయా గదులు, హాలులో గోడలు చెమ్మగిల్లుతున్నాయి. గోడలు పెచ్చులూడి పడుతున్నాయి. భవనం బయట నుంచి చూస్తే శిథిల భవనంలా కనిపిస్తోంది. భవనం నాచు పట్టింది. కనీసం పలానా కార్యాలయం అనే పేరు కూడా కనిపించచడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ పనిచేసే సిబ్బంది సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు సాధికారతనిచ్చే శాఖకు సంబంధించిన వెలుగు కార్యాలయ భవనం ఈ దుస్థితిలో ఉండడం పట్ల పలువురు విస్మయం చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి భవనం మరమ్మతులు చేపట్టాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.

ఆర్అండ్‌బీ అధికారులపై ప్రజా ప్రతినిధుల ధ్వజం

ఏళ్ల తరబడి గొయ్యిలైనా పూడ్చలేకపోయారని మండిపాటు

వాడీవేడిగా రావికమతం మండల సర్వసభ్య సమావేశం



ఆర్అండ్‌బీ రోడ్లపై జేఈ సాయిశ్రీనివాస్‌ను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

రావికమతం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖ అధికారులపై ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. రహదారులు పోలిక లేకుండా ధ్వంసమై ఏళ్లు గడుస్తున్నా, ప్రజలు ప్రాణాలు పోతున్నా కనీసం గోతులైనా పూడ్చలేని స్థితిలో ఉన్నారని సభ్యులంతా ఏకమై మండిపడ్డారు. వెలుగు కార్యాలయంలో ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఆర్అండ్‌బీ శాఖ మాడుగుల సెక్షన్ జేఈ సాయిశ్రీనివాస్ మాట్లాడుతుండగా సభలో అన్ని పార్టీల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఏకమై విరుచుకుపడ్డారు. ప్రజల ప్రాణాలు లెక్కలేవా.. మీ కళ్ల ముందే చెరువులను తలపించే గుంతల్లో ప్రమాదాలకు గురై ఎంతో మంది చనిపోతున్నా పట్టదా.. తరచూ వాహనాలు గోతుల్లో కూరుకుపోయినా, గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని అధికారులను నిలదీశారు. మండలం పరిధిలో బీఎన్ రోడ్డు, రావికమతం-తోటకూరపాలెం(ఆర్ఈసీ) రోడ్లు శిథిలమై, కనీసం రోడ్డు పోలికలు కూడ లేని విధంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి వచ్చినప్పుడల్లా ఇదిగో పనులు ప్రారంభిస్తున్నాం, అదిగో అంటూనే ఏళ్లు గడిపేస్తున్నారని మండిపడ్డారు. 'మీకో దండం.. రోడ్లు వేయకపోయినా కనీసం మితిమీరిన బరువులతో రాకపోకలు చేసే వాహనాలైనా అడ్డుకోండి' అని గొంప ఎంపీటీసీ సభ్యుడు గంజి సూర్యనారాయణ, తట్టబంద, గుడ్డిప సర్పంచులు గోకివాడ రమణ, జి.గణేశ్ తదితరులు అధికారులను నిలదీసారు. దీనికి సభ్యులంతా గొంతు కలపడంతో సభ గందరగోళంగా మారింది. అలాగే క్వారీలలో బాంబు బ్లాస్టింగ్‌లతో పరిసర గ్రామాల ప్రజలు హడలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తట్టబంద కన్నూరువారి ఇళ్ల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి ఆరు నెలలైనా పట్టించుకోకపోవడంతో తాగునీరు, వ్యవసాయ మోటార్లు పనిచేయలేదని తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ ఆరోపించారు. అర్జాపురంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై వైస్ ఎంపీపీ ఎం.భవానీ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తకోట పీహెచ్‌సీలో రెండో వైద్యాధికారి ఉన్నప్పటికీ విధులకు హాజరు కాకపోవడంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నర్సీపట్నం డిపో నుంచి సక్రమంగా ఆర్టీసీ బస్సులు నడపక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని, కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్, తహశీల్దార్ అంబేడ్కర్, వైస్ ఎంపీపీలు దంట్ల రమణ, భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

గోవాడలో మెగా వైద్య శిబిరం

చోడవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడలో వివేకానంద విద్యా సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేయడంతో పాటు, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రామప్పారావు, స్థానిక నాయకులు ఏడువాక లక్ష్మణకుమార్, అర్జునరావు, సత్యారావు, గొల్లవెల్లి రమణలతో పాటు, కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు దొండపూడి హైస్కూల్ విద్యార్థిని ఎంపిక



క్రీడా పోటీలకు ఎంపికైన కీర్తన

రావికమతం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.కీర్తన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటిన ఆమె, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించింది. తొమ్మిదో తరగతి చదువుతున్న కీర్తన అండర్-14 విభాగంలో మాకవరంపాలెంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని సత్తాచాటినట్టు పాఠశాల హెచ్ఎం బి.అప్పారావు శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో కీర్తన మొదటి స్థానం సాధించి, రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైందని హెచ్ఎం చెప్పారు. కీర్తనతో పాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన పీడీ ఆనంద్‌ను, ఆటల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఈ సందరంగా ఆయన అభినందించారు.

ఆలయ ప్రారంభోత్సవంలో విద్యార్థుల సందడి

» ఉపాధ్యాయుల తీరుపై స్థానికుల మండిపాటు



పాఠశాలకు ఆనుకుని కిక్కిరిసన భక్తులు

చీడికాడ, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోనాం శివారు గుంటు కొత్తూరు గ్రామంలో శుక్రవారం సర్వసిద్ధిస్వామి నూతన దేవాలయం ప్రారంభోత్సవంలో విద్యార్థులు సందడి చేశారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా మైకొసెట్ హోరెత్తింది. ఈ క్రమంలో దేవాలయానికి ఆనుకుని ఉన్న ఈ పాఠశాలకు కూడా భక్తులు తాకిడి పెరిగింది. ఈ క్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు గీతాలపనల మధ్య సంబరంలో విద్యార్థులు సందడి చేశారు. ఈ విషయాన్ని పరిశీలించిన పాత్రికేయులు ఉపాధ్యాయులను ప్రశ్నించగా, ఎంఈవోల అనుమతితో పాఠశాలకు సెలవు ఇద్దామన్నా, ఎంఈవోలు అందుబాటులో లేరని తెలిపారు. దీనిపై ఎంఈవో బొంజుబాబును వివరణ కోరగా, గ్రామంలో అంత పెద్ద కార్యక్రమం జరుగుతుందని తన దృష్టికి ఏ ఉపాధ్యాయుడు తీసుకోని రాలేదని స్పష్టం చేశారు. దీనిపై విచారణ చేస్తామని ఆయన తెలిపారు.

పెదమదీనలో కవయిత్రి మొల్ల విగ్రహం ఆవిష్కరణ

బుచ్చెయ్యపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమదీన గ్రామంలో శుక్రవారం కవయిత్రి మొల్ల విగ్రమాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో సాలివాహన సంఘం ప్రతినిధులు నిర్మించిన ఈ విగ్రహాన్ని వైసీపీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు ఆవిష్కరించారు. సంఘ అధ్యక్షుడు మాకవరపు లక్ష్మి, సర్పంచ్ కె.ధనలక్ష్మినాయుడు, తెలుగుయవత జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీను, నాయకులు కరకపాటి రాము, గోవింద్, రామరాజు, అధిక సంఖ్యలో గ్రామస్థులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పోరాడతాం

» సంతకాల సేకరణ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌నాథ్



సంతకాల సేకరణ కార్యక్రమంలో అమర్‌నాథ్

చోడవరం, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేవరకూ పోరాటం ఆపేది లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పష్టం చేశారు. కొత్తూరు జంక్షన్‌లో శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 12న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, బొడ్డేడ ప్రసాద్, ఏడువాక సత్యారావు, దొండా రాంబాబు, పోతల ప్రసాద్, దేవరపల్లి సత్య, చందు రాంబాబు పాల్గొన్నారు.

పింఛన్ల మంజూరు లోపాల్లో అధికారులపై చర్యలు తీసుకోవాలి

గొలుగొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పింఛన్లు మంజూరులో తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు ఎస్.వెంకటగిరిబాబు డిమాండ్ చేశారు. పింఛన్ల మంజూరులో అధికారులు తప్పులు చేస్తే లబ్ధిదారులపై కేసులు పెడతామనడం సమంజసం కాదన్నారు. పింఛన్లు తొలగిస్తామని, క్రిమినల్ కేసులు పెడతామని లబ్ధిదారులను అధికారులు భయపెడుతున్నారని ఆరోపించారు. ఆయన వెంట ఉప సర్పంచ్ సత్యనారాయణ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాడుగుల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ ఎంవీఎస్ఎం.అప్పారావు తెలిపారు. ఎం.కోడూరు, మాడుగుల, సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, గాదిరాయి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా కలుగుతున్న ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

వీరనారాయణంలో పశు వైద్య శిబిరం

మాడుగుల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరనారాయణం గ్రామంలో శుక్రవారం ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. కేజే పురం పశు వైద్యాధికారి శివకుమార్ 75 పశువులకు గర్భకోశ చికిత్స చేశారు. అలాగే 67 పెయ్యిలకు నట్టల నివారణ మందులు వేశారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇస్తున్న పథకాలు, రాయితీలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా పాడి రైతులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండప్పారావు, పశు వైద్యుడు గణేశ్ పల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ భవన పనులకు శంకుస్థాపన

కృష్ణాదేవిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏఎల్ పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణ పనులకు సర్పంచ్ లోచల సుజాత శుక్రవారం శంకుస్థాపన చేశారు. సమగ్రశిక్షాభియాన్ నిధులు రూ.23.1 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్టు సర్పంచ్ తెలిపారు. ఈ భవనాన్ని త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.కృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు రుత్తల రామకృష్ణ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ లగుడు రాజులునాయుడు, నాయకులు బి.జమీలు, స్వామినాయుడు, చిట్టిబాబు పాల్గొన్నారు.

చోద్యంలో వైసీపీ కోటి సంతకాల సేకరణ

కృష్ణాదేవిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చోద్యం గ్రామంలో శుక్రవారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. కూటమి ప్రభుత్వం అన్యాయంగా మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నదని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్ చెప్పారు. చెప్పారు. ఈ ప్రక్రియను అన్ని వర్గాల వారు అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షరాలు లోచల సుజాత, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బొందల రాజు, సర్పంచ్ సంతోశ్‌కుమార్, వైసీపీ నాయకులు నాని, కవి, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులపై బీజేపీ ప్రచారం

నర్సీపట్నం అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువులను మాత్రమే కొనుగోలు చేసి దేశ ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ మండల కన్వీనర్ బోళెం అప్పన్నదొర కోరారు. ఈ మేరకు శుక్రవారం నర్సీపట్నంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, రూరల్ మండల కన్వీనర్ నిద్ర శ్రీనివాస్, నాయకులు డాక్టర్ సత్యనారాయణ, యువమోర్చా నేత గవిరెడ్డి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకంలో వివరాలు సరిచేసుకోండి

నర్సీపట్నం అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంలో వివరాలు సరిచేసుకోవాలని వ్యవసాయాధికారి విజయలక్ష్మి సూచించారు. ఆధార్ తప్పుగా పడడం, ఒక ఆధార్ నంబర్‌తో ఎక్కువ మందికి మ్యాప్ చేసి ఉండడం, పట్టాదారు పాస్ పుస్తకానికి ఆధార్ లింక్ కాకపోవడంతో తదితర కారణాలతో చాలా మందికి లబ్ధి చేకూరలేదన్నారు. వారంతా మీ సేవా లేదా సచివాలయాల్లో సవరణలకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఆయా రైతులు ఎటువంటి రుసుం చెల్లించకుండానే సరిచేసుకోవచ్చని ఆయన చెప్పారు.

చిన్నప్పన్నపాలెం మాజీ సర్పంచ్ మృతి



అచ్చియ్యదొర (ఫైల్)

బుచ్చెయ్యపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నప్పన్నపాలెం మాజీ సర్పంచ్ దొండా అచ్చియ్యదొర మృతి చెందారు. కొన్ని రోజులు క్రితం ఇంటి వద్ద మెట్లపై జారి పడి గాయపడ్డారు. ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుది శ్వాస విడిచారు. బుచ్చెయ్యపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా, మూడు దఫాలు చిన్నప్పన్నపాలెం సర్పంచ్‌గా, రెండు పర్యాయాలు పాల సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

నేడు అఖండ సాయి నామ సంకీర్తన

కె.కోటపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయంలో శనివారం అఖండ సాయి నామ సంకీర్తన భజన కార్యక్రమం నిర్వహించనున్నట్టు భగవాన్ సత్యసాయిబాబా సేవా సమితి కన్వీనర్ బి.నారాయణపాత్రుడు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమై ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు కార్యక్రమం ముగుస్తుందన్నారు. భక్తులు సాయి నామాన్ని జపిస్తూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఉప ఖజానా దొంగలపై కొరడా

» సీతమ్మధార సబ్ ట్రెజరీలో కుంభకోణంపై చర్యలు

» 2011-2017 మధ్య రూ.6 కోట్లు స్వాహా అయినట్టు విజిలెన్స్ నివేదిక

» 11 మంది సీనియర్ అకౌంటెంట్లకు చార్జిమెమోలు

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని డివిజనల్ సబ్ ట్రెజరీలో పింఛన్‌దారుల పేరిట సొమ్ములు స్వాహా చేసిన ఉద్యోగులపై ప్రభుత్వం ఎట్టకేలకు చర్యలకు ఉపక్రమించింది. అందుకు బాధ్యులైన 11 మంది సీనియర్ అకౌంటెంట్లకు చార్జిమెమోలు జారీ చేయాలని ఖజానా శాఖ విశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఈ మేరకు పది రోజుల క్రితం వారందరికీ డీడీ చార్జిమెమోలు ఇచ్చారు. నగరంలో వేలాది మంది రిటైర్డు ఉద్యోగులకు ప్రతినెలా సీతమ్మధార డివిజనల్ సబ్ ట్రెజరీ నుంచి పింఛన్లు బట్వాడా చేస్తుంటారు. ఏడాదికి ఒకసారి ప్రతి పింఛన్‌దారుడు లైఫ్ సర్టిఫికెట్‌ను ట్రెజరీకి అందజేయాలి. అదేవిధంగా ఎవరైనా చనిపోయినట్టయితే కుటుంబ సభ్యులు డెత్ సర్టిఫికెట్ సమర్పించాలి. 2011 సంవత్సరం వరకూ సర్టిఫికెట్లు మాన్యువల్‌గా తీసుకుని అప్‌లోడ్ చేసే విధానం ఉండేది. ఈ నేపథ్యంలో పింఛన్‌దారుడు చనిపోయినట్టు కుటుంబ సభ్యులు డెత్ సర్టిఫికెట్ ఇచ్చినా సబ్ ట్రెజరీ సిబ్బంది దానిని అప్‌లోడ్ చేయకుండా ఆ మొత్తం ప్రతి నెలా వేరొక బ్యాంకు అకౌంట్‌లో జమ చేసి డ్రా చేసుకునేవారు. మరికొంతమంది విషయంలో పింఛన్‌దారుడు చనిపోయినట్టు సర్టిఫికెట్ తీసుకువచ్చిన కుటుంబ సభ్యులతో ట్రెజరీ ఉద్యోగులు కుమ్మక్కై వచ్చిన పింఛన్ చెరిసగం పంచుకున్నారు. ఇలా 2011 నుంచి 2017 వరకూ సుమారు రూ.ఆరు కోట్ల వరకు స్వాహా జరిగింది. సొమ్ములు పక్కదారిపట్టినట్టు 2018లో వెలుగులోకి రావడంతో అప్పట్లో కొందరు ఉద్యోగులను సస్పెండ్ చేయగా, ఇద్దరు, ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వెంకటనరసింగరావు అనే ఉద్యోగి నుంచి సుమారు రూ.95 లక్షలు రికవరీ చేశారు. ఈ కుంభకోణంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేపట్టింది. సుదీర్ఘంగా విచారించి 2021లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అప్పటి నుంచి పలుమార్లు విజిలెన్స్ అధికారులు వార్షిక నివేదికలలో ట్రెజరీ కుంభకోణం విషయాన్ని ప్రస్తావిస్తూ వచ్చారు. చివరకు ఈ ఏడాది ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖను ఆదేశించింది. దీంతో 2011 నుంచి 2017 వరకు జరిగిన పింఛన్ సొమ్ముల స్వాహాకు సంబంధించి అప్పట్లో సీతమ్మధార డివిజనల్ సబ్‌ట్రెజరీలో పనిచేసి ప్రస్తుతం సీనియర్ అకౌంటెంట్లుగా ఉన్న 11 మందిపై చర్యలు తీసుకోవాలని విశాఖలోని ఖజానా కార్యాలయం డీడీని ఖజానా రాష్ట్ర డైరెక్టర్ ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం జిల్లా కార్యాలయంతోపాటు అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్న 11 మందికి ఆయన చార్జిమెమోలు జారీచేశారు. పింఛన్ల సొమ్ము స్వాహాకు సంబంధించిన వ్యవహారంలో ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. చార్జిమెమోలు అందుకున్న వారిలో చినఅప్పలరాజు, శ్రావ్య గోపాల్, హైమా, పైడిరాజు, అశోక్, రాజు ప్రకాశ్, బేబీ చైతన్య, తదితరులు ఉన్నారు. వీరిలో కొందరు కొంత సమయం కావాలని డీడీని కోరారు.

వందేమాతర గీతం అందరికీ స్ఫూర్తిదాయకం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు


జాతీయ పతాకాలతో టీడీపీ నేతలు బత్తుల తాతయ్యబాబు, బుద్ద నాగజగదీశ్వరరావు, తదితరులు

అనకాపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతం ప్రతి భారతీయుడికి ఒక స్ఫూర్తిదాయక గీతమని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతాయ్యబాబు అన్నారు. సీనియర్ నేత బుద్ద నాగజగదీశ్వరరావుతో కలిసి శుక్రవారం టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో '150 ఏళ్ల వందేమాతరం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాను చేతపట్టుకొని వందేమాతర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, మళ్ల గణేశ్, బంగార్రాజు, కాండ్రేగుల గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

» రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొన్న ద్విచక్ర వాహనం

» అక్కడికక్కడే ఒకరు, ఆస్పత్రిలో మరొకరు మృతి


నాగరాజు (ఫైల్)

కూర్మన్నపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై అగనంపూడి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరొకరు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాజువాక పైడిమాంబ కాలనీకి చెందిన వల్లూరు శ్రీనివాసరావు, భార్య రమణమ్మ (58), కుమారుడు తారక్‌తో కలిసి అగనంపూడిలో అద్దెకు ఉంటూ పాల బూత్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. రమణమ్మ శుక్రవారం పని ఉండి కూర్మన్నపాలెం వచ్చింది. తిరిగి ఆటోలో అగనంపూడి వెళ్లింది. ఆటో దిగి ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా అనకాపల్లి నుంచి గాజువాక వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న మునగపాక మండలం చూచుకొండ గ్రామానికి చెందిన సారిక నాగరాజు (48) ఢీకొన్నాడు. దీంతో రమణమ్మ సంఘటనా స్థలంలోనే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. తీవ్ర గాయాలు పాలైన నాగరాజు, జవహర్‌ను కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సారిక నాగరాజు (48) మృతి చెందాడు. జవహర్‌కు కుడి కాలు, చెయ్యికి దెబ్బలు తగిలాయి. డిగ్రీ పూర్తిచేసిన జవహర్ ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. తారక్ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జవహర్ నుంచి ఫిర్యాదు రావాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

శత వసంతాల హాకీ వేడుక


ఎలమంచిలిలో క్రీడాకారులకు హాకీ స్టిక్‌లు పంపిణీ చేస్తున్న జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గోపి


నక్కపల్లిలో త్రివర్ణ పతాకాలతో ర్యాలీ చేస్తున్న హాకీ క్రీడాకారులు

ఎలమంచిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో హాకీ ఫెడరేషన్ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక రాజీవ్‌గాంధీ క్రీడామైదానంలో శుక్రవారం 'శత వసంతాల హాకీ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను హాజరయ్యారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ఎలమంచిలిలో హాకీ క్రీడాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. హాకీ క్రీడకు పుట్టినిల్లుగా విరాజిల్లుతున్న ఎలమంచిలిలో క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను మాట్లాడుతూ, సీనియర్ క్రీడాకారుల నుంచి మెలకువలు నేర్చుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు హాకీ స్టిక్‌లను పంపిణీ చేశారు. సీనియర్ క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిమోటూరి గోపి, జనసేన నేతలు కర్రి ఝాన్సీ, జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ కొఠారు నరేశ్, జీవీరెడ్డి, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో సంబరాలు

నక్కపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో హాకీ ఫెడరేషన్ ఏర్పడి నూరేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం నక్కపల్లిలో బీఎస్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాకారులు సంబరాలు జరుపుకున్నారు. కోచ్‌లు, క్రీడాకారులు కలిసి కేక్ కట్‌చేశారు. అనంతరం త్రివర్ణ పతాకాలతో హైస్కూల్ నుంచి హైవే మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాకీ క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షుడు చిన్న అప్పారావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, రామచంద్రరావు, రంజిత్, కోచ్ రాంబాబు, హైస్కూల్ హెచ్‌ఎం విజయ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

» లబ్ధిదారులకు ఉచిత సామగ్రి ఇవ్వడం వీలుకాదు

» కలెక్టర్ విజయకృష్ణన్


తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ విజయ్‌కృష్ణన్, ఆర్డీవో వీవీ రమణ

నక్కపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లంలో సెజ్ పునరావాస కాలనీలో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా సహకరించాలని కలెక్టర్ విజయ్‌కృష్ణన్ స్థానిక నేతలను కోరారు. శుక్రవారం మధ్యాహ్నం నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆమె.. నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, డీఎల్‌పురం, చందనాడ, మూలపర్ర గ్రామాలకు చెందిన కొందరు నాయకులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణానికి కొంత సమయం కావాలని, భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని పలువురు నాయకులు కోరారు. ఇళ్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులకు సిమెంటు, ఇతర సామగ్రి ఉచితంగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఉచితం సాధ్యం కాదని, ఉచిత రవాణాతోపాటు, తక్కువ ధరకు సామగ్రి సరఫరా అయ్యేలా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, డీఎల్‌పురం ఎంపీటీసీ సభ్యుడు కె.కనకారావు, రైతు సంఘ నాయకులు సూరకాసుల గోవింద్, గంటా నర్సింగరావు, తళ్లా భార్గవ్, గంటా తిరుపతిరావు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో వృత్తి విద్య కీలకం

» సమగ్ర శిక్ష జిల్లా కో-ఆర్డినేటర్ జయప్రకాశ్

» విద్యార్థులకు జిల్లాస్థాయి నైపుణ్య పోటీలు


నైపుణ్య పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాల కల్పనలో వృత్తి విద్య కీలకం అని సమగ్ర శిక్ష జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్.జయప్రకాశ్ పేర్కొన్నారు. మండలంలోని ఇరువాడలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాస్థాయి నైపుణ్య పోటీలు జరిగాయి. జిల్లాలోని 68 ప్రభుత్వ విద్యా సంస్థల్లో తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న సుమారు 500 మంది బాలబాలికలు ఈ కార్యక్రమంలో పాల్గొని 117 ట్రేడ్స్‌లో పోటీపడ్డారు. 200కుపైగా వర్కింగ్ మోడల్స్ ప్రదర్శించారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సమగ్ర శిక్ష జిల్లా కో-ఆర్డినేటర్ జయప్రకాశ్

ముఖ్యఅతిగా పాల్గొన్న జయప్రకాశ్.. అత్యంత ప్రతిభను కనబరిచిన 10 మంది విద్యార్థులను విజేతలుగా ప్రకటించి బహుమతులు అందజేశారు. వీరు ఈ నెల 14వ తేదీన జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా జీసీడీవో (గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆధికారి) ఏఎస్‌డీ జమీమా, ఎంఇవో-2 రవీంద్రబాబు, ఎంసుధాకర్, ఎస్.రమేశ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్య పోటీల విజేతలు

అప్పెరల్ ట్రేడ్, ఐటీ విభాగంలో పరవాడ మండలం తానాంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల, వ్యవసాయ విభాగంలో లక్ష్మీపురం జడ్పీహెచ్‌ఎస్, బ్యూటీ వెల్‌నెస్‌లో జడ్పీహెచ్‌ఎస్ పరవాడ, హెల్త్‌కేర్‌లో జడ్పీహెచ్‌ఎస్ చినపాచిల, ఎలక్ట్రానిక్స్‌లో జడ్పీహెచ్‌ఎస్ వడ్డాది, ఫుడ్ ప్రాసెసింగ్‌లో కేజీబీవీ గొలుగొండ, ఆటోమోటివ్‌వో ఏపీఎంఎస్ పెదపల్లి, బీఎఫ్‌ఎస్‌ఐలో జడీహెచ్‌ఎస్ రాంబిల్లి, రిటైల్ విభాగంలో జడ్పీహెచ్‌ఎస్ వేంపాడు విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

ఢిల్లీలో ప్రతిభ చాటిన కింతలి హైస్కూల్ విద్యార్థిని లిఖిత

» జాతీయ స్థాయి వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో తృతీయ స్థానం

» అభినందించిన కలెక్టర్ విజయకృష్ణన్


ప్రతిభ కనబరిచిన కింతలి జడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని కొటారి లిఖిత



ప్రశంసాపత్రాలతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

మాడుగుల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కింతలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని కొటారి లిఖిత ఢిల్లీలో నిర్వహించిన ఇండో రష్యన్ స్పేస్ కొలాబ్రేషన్ జాతీయ స్థాయి వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచింది. ఢిల్లీలో సైన్స్ ఎక్స్‌పోజర్స్ టూర్‌కి రాష్ట్ర వ్యాప్తంగా 52 మంది ఎంపికయ్యారు. వీరిలో కొటారి లిఖిత, నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థిని సీహెచ్ రేణుకాదేవి ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహంతో ఏపీ సమగ్ర శిక్ష సైన్స్ సిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 52 మంది విద్యార్థులను విమానంలో ఢిల్లీ తీసుకెళ్లారు. ఈనెల ఆరో తేదీ నుంచి మూడు రోజులు పాటు జరగనున్న సైన్స్ ఎక్స్‌పోజర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా నేషనల్ సైన్స్ మ్యూజియం, నెహ్రూ ప్లాంటోరియం, రష్యన్ స్పేస్ సెంటర్లను సందర్శించారు. దేశ వ్యాప్తంగా పాల్గొన్న విద్యార్థులతో పాటు 52 మంది విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఇండో రష్యన్ స్పేస్ కొలాబ్రేషన్ జాతీయ స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో లిఖిత పాల్గొని తృతీయ స్థానంలో నిలిచింది. విద్యార్థిని లిఖితను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అభినందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని లిఖితతో పాటు విద్యార్థినికి గైడ్ చేసిన సైన్స్ ఉపాధ్యాయుడు బొమ్మిశెట్టి ప్రసాదరావులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

విస్తృతంగా వేట

... 5వ పేజీ తరువాయి

వెనుకపడేవి. దీనిపై విమర్శలు రావడంతో కేంద్ర ప్రభుత్వం ఏకంగా లైసెన్స్‌లు ఇవ్వడం మానేసింది.

కాలుష్యంతో వేట తగ్గి మరింత ముందుకు...

తీరం వెంబడి పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటు కావడం, వాటి కాలుష్య వ్యర్థాలను సముద్రంలోకి విడిచి పెట్టడం వల్ల తీరాన్ని ఆనుకొని ఉన్న ప్రాదేశిక జలాల్లో చేపల లభ్యత తగ్గిపోయింది. దాంతో మత్స్యకారులు అనధికారికంగా జాతీయ జలాల్లోకి వెళ్లి వేటాడుతున్నారు. కొన్నిసార్లు కోస్టుగార్డుకు దొరికిపోతున్నారు. ఒక్కోసారి చేపలను వెదుక్కుంటూ శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు కూడా వెళ్లిపోతున్నారు. వెనక్కి తీసుకురావడం కత్తిమీద సాముగా మారుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ జలాల్లో 200 నాటికల్ మైళ్ల వరకు ఎవరైనా వేట చేసుకోవచ్చునంటూ వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో డీప్ సీ ఫిషింగ్‌కు అవకాశం లభించింది.

జాగ్రత్తలు తప్పనిసరి

లక్ష్మణరావు, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ



కేంద్రం ఉత్తర్వులు మత్స్యకారులకు పెద్ద వరం. అయితే వేటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన ట్రాన్స్‌పాండర్‌ను వేట సమయంలో ఆన్ చేసి ఉంచాలి. దానివల్ల పరిధి దాటి అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లకుండా చూసుకోవచ్చు. అదేవిధంగా జీపీఎస్ ఉంచుకోవాలి. లైఫ్ జాకెట్లు, మంటలను ఆర్పే పరికరాలను బోటులో పెట్టుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటే మంచి వేటతో క్షేమంగా తీరానికి చేరుకోవచ్చు.

క్రైం... crime news

అతిథి అధ్యాపకుడి అరెస్టు

నర్సీపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని లైగింక వేధింపులకు పాల్పడిన అతిథి అధ్యాపకుడు కోనా నారాయణరావుని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశ పెట్టామని పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బాధిత విద్యార్థిని, తోటి విద్యార్థినులు, ప్రిన్సిపాల్, ఫైవ్ మెన్ కమిటీలోని అధ్యాపకుల వాగ్మూలాలు తీసుకున్నామని తెలిపారు. అతిథి అధ్యాపకుడు నారాయణరావు వాట్సాప్‌లో మెసేజ్‌లు, ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడడం చేశాడని బాధిత విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసిందని చెప్పారు.

అట్రాసిటీ కేసులో వైసీపీ నేతతో సహా ఇద్దరి అరెస్టు

నక్కపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట కార్యదర్శి కాకర సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇదే గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద వైసీపీ నాయకుడు పిక్కి తాతీలు, పిక్కి కోటి అలియాస్ రాంచరణ్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్టు సీఐ జె.మురళి తెలిపారు. ఇటీవల మొంథా తుఫాన్ సందర్భంగా రాజయ్యపేట సచివాలయంలో అందరికీ భోజనాలు పెట్టలేదని, ఈ విషయమై దండోరా వేయలేదంటూ పిక్కి తాతీలు, పిక్కి కోటి తమను సచివాలయంలో నిర్బంధించి దుర్భాషలాడి, దౌర్జన్యం చేశారని కాకర సత్యంతోపాటు సచివాలయ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎస్పీ విచారణ జరిపారు. కాకర సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు.

కాలిన గాయాలతో చికిత్స పొందుతూ మహిళ మృతి

కొత్తూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం కుంచంగిలో ఇటీవల దుస్తులకు నిప్పంటుకుని తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. అనకాపల్లి రూరల్ పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. కుంచంగికి చెందిన చిన్ని నాగమణి (30) ఈ నెల 4వ తేదీన ఇంటిలో వంట చేస్తుండగా, పక్కనే వున్న కాగితాలకు నిప్పంటుకుని, మంటలు ఆమెను చుట్టుముట్టాయి. దీంతో తీవ్రంగా గాయపడిన నాగమణిని చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతిచెందింది. ఆమె తండ్రి అల్లం మల్లీశ్వరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

600 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

కొత్తూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అనకాపల్లి రూరల్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. అదనపు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కోడూరు కూడలి వద్ద పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తున్నారు. ఈ సమయంలో ఆటోలో బియ్యం బస్తాలను రవాణా చేస్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేశారు. రేషన్ బియ్యంగా నిర్ధారణ కావడంతో డ్రైవర్ యలమంచిలి జయబాబుపై కేసు నమోదు చేసి 600 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనాల మంజూరు కోసం అర్హులైన విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి శ్రీదేవి తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బీసీ, ఈబీసీ, డీఎన్‌టీ (సంచార జాతులు) విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రెండున్నర లక్షల రూపాయలలోపు ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులు దరఖాస్తుతోపాటు గత విద్యా సంవత్సరం మార్కుల జాబితా, బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ కార్డు, కుల్రధ్రువీకరణ పత్రం అప్‌లోడ్ చేయాలని, వివరాల కోసం 99894 58416 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

రేషన్ అక్రమాలకు చెక్

... 5వ పేజీ తరువాయి

వచ్చినా వెంటనే రంగంలోకి దిగుతారు. బస్తాల్లో నుంచి బియ్యం శాంపిల్స్ తీసి, తమ వద్ద ఉన్న కిట్లలోని ద్రావణాన్ని చల్లుతారు. ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యం అయితే.. ద్రావణం చల్లిన కొద్దిసేపటికే ప్రతి వంద గ్రాముల్లో 5-6 గ్రాముల బియ్యం ఎరుపు రంగులోకి మారతాయి. అదే మార్కెట్‌లో విక్రయించే బియ్యం అయితే రంగు మారదు. ఎరుపు రంగులోకి మారితే వెంటనే అక్రమార్కులపై కేసు నమోదు చేసి, బియ్యంతోపాటు వాహనాలను సీజ్ చేస్తారు. అయితే ర్యాపిడ్ కిట్లను ప్రభుత్వం అందుబాటులోకి తేవడంతో రేషన్ మాఫియా కొత్త దారులను వెతుకుతున్నట్టు తెలిసింది.

బలహీనంగా గోవాడ వంతెన

... 5వ పేజీ తరువాయి

ఇప్పటికే వడ్డాది వద్ద పెద్దేరు నదిపై ఉన్న వంతెన, విజయరామరాజుపేట వద్ద తాచేరు గెడ్డపై వున్న వంతెన కూలిపోయిన విషయం తెలిసింది. ఈ రెండుచోట్ల ఇంతవరకు శాశ్వత వంతెనల నిర్మాణం చేపట్టలేదు వడ్డాది వద్ద కాజ్‌వేపై సీసీ రోడ్డు వేశారు. కానీ నదిలో వరద ఉధృతి పెరిగితే కాజ్‌వేకు ఇరువైపులా సిమెంట్ కాంక్రీట్ ధ్వంసమై, వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతున్నది. దీంతో లారీలు, బస్సుల రాకపోకలు నిలిచిపోతున్నాయి. కార్లు, జీపులు, ఆటోలు వంటి తేలికపాటి వాహనాలను పాత వంతెన మీదుగా అనుమతిస్తున్నారు. ఇక విజయరామరాజుపేట వద్ద కాజ్‌వేను పూర్తిగా గ్రావెల్‌తో నిర్మించారు. తాచేరు గెడ్డలో వరద ప్రవాహం పెరిగితే కాజ్‌వే కొట్టుకుపోతున్నది. గత రెండేళ్లలో ఈ కాజ్‌వేకు మూడుసార్లు గండి పడింది. దీంతో వాహనాలు చుట్టూ తిరిగి, ఇరుకు రోడ్లలో వెళ్లాల్సి వస్తున్నది. ఈ తరుణంలో గోవాడ వంతెనకు ముప్పు వాటిల్లితే మైదాన ప్రాంతం నుంచి పాడేరు ఏజెన్సీకి రవాణా సదుపాయం స్తంభిస్తుంది. వంతెన కూలిపోయే వరకు వేచిచూడకుండా.. వెంటనే కొత్త వంతెన నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

డిగ్రీ పూర్తికి మరో అవకాశం

... 5వ పేజీ తరువాయి

తాజాగా వర్సిటీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కొద్దిరోజుల్లో షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ తెలిపారు. ఇది వందలాది మంది విద్యార్థులకు మేలు చేస్తుందన్నారు. ఇప్పుడు డిగ్రీ విద్యార్థులు చెల్లిస్తున్న ఫీజునే వసూలు చేయనున్నారు.

వర్సిటీ అధికారులు మరో కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. వివిధ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అత్యవసరంగా కావాలంటే ప్రస్తుతం నిర్ణీత రుసుము కంటే కొంచెం ఎక్కువ మొత్తం (తత్కాల్ పద్ధతి) వసూలు చేస్తున్నారు. తత్కాల్ విధానంలో సర్టిఫికెట్లను ఒకటి, రెండు రోజుల్లో ఇస్తున్నారు. అయితే, తత్కాల్ ఫీజు విద్యార్థులకు భారంగా మారుతుందని గ్రహించిన అధికారులు దానిని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులకు నిజంగానే అత్యవసరంగా సర్టిఫికెట్లు కావాల్సి వస్తే...తత్కాల్ విధానంలో ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఒకరోజులో ఇచ్చేలా చర్యలు చేపడుతున్నారు. దీనికి సంబంధించి ఆదేశాలను ఇప్పటికే ఎగ్జామినేషన్ విభాగానికి ఇచ్చినట్టు వైస్ చాన్సలర్ వెల్లడించారు.

రావణాపల్లి ఆనకట్టకు ముప్పు

... 5వ పేజీ తరువాయి

పెరిగిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గట్టు మరమ్మతులకు రూ.2 లక్షలు, ప్రధాన గేటు మరమ్మతులకు రూ.3.6 లక్షలు మంజూరయ్యాయి. ఆనకట్ట గోడలు, పొర్లుకట్టు, మదుముల మరమ్మతు పనులకు నిధులు మంజూరు కాలేదు. ఆయా పనులు చేయడానికి రూ.90 లక్షలు అవసరమని జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు వెంటనే మంజూరు చేసి, వచ్చే ఖరీఫ్‌లోగా పనులు పూర్తిచేయించాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589